డ్వాక్రా సంఘాలకు వైసీపీ వల!

తాయిలాలతో మహిళలను ఆకట్టుకునేందుకు యత్నాలు

- సంఘాలు, సభ్యుల వివరాల సేకరణలో అధికార పార్టీ నేతలు
- ఫోన్ నంబర్లను కూడా సేకరిస్తున్న వైనం
- పూర్తిస్థాయిలో సహకరిస్తున్న మెప్మా అధికారులు?
- ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా తమవైపు తిప్పుకునేలా చర్యలు

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వంపై పూర్తిస్థాయి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఓటు బ్యాంకును ప్రోది చేసుకునేందుకు వైసీపీ నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాల మహిళలకు గేలం వేస్తున్నారు. జిల్లాలోని సంఘాలు, సభ్యుల వివరాలను సేకరిస్తున్నారు. వీరిలో వైసీపీకి అనుకూలంగా ఉన్న వారు, ఇతర పార్టీల పట్ల సానుకూలత ఉన్న వారి వివరాలను ఆరా తీస్తున్నారు. ఈ ప్రక్రియకు మెప్మా అధికారులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారి సాయంతో మహిళలకు తాయిలాలను పంపిణీ చేయడం ద్వారా తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.



స్వయం సహాయక సంఘాల మహిళల వివరాలను సేకరించడంలో నగర పరిధిలోని రెండు నియోజకవర్గాలకు చెందిన కీలక వైసీపీ నేతలు ఇప్పటికే ముందున్నారు. ఇతర నియోజకవర్గాల నేతలు అదేపనిలో ఉన్నట్టు సమాచారం. మహిళా సంఘం పేరు, ఎంతమంది సభ్యులున్నారు, వారి పేర్లు, వ్యక్తిగత ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. వీటి ఆధారంగా తాయిలాలు పంపిణీ చేసి, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు యత్నిస్తున్నారని తెలిసింది. దీంతో పాటు సభ్యుల అంతరంగాన్ని తెలుసుకునేందుకు వారి నేరుగా ఫోన్లు చేసేందుకు కూడా రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. దీనివల్ల వైసీపీకి సానుకూలంగా ఉన్నవారు, వ్యతిరేకంగా ఉన్న వారిపై స్పష్టత వస్తుందని భావిస్తున్నారు. అధికార పార్టీపై వ్యతిరేకత ఉన్న వారిని గుర్తించి, వారికి మరిన్ని ఎక్కువ తాయిలాలు అందించడం ద్వారా తమవైపు తిప్పుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిసింది. అవసరమైతే ఉన్నతస్థాయి అధికారుల ద్వారా మహిళలపై ఒత్తిడి తెచ్చే యోచనలో అధికార పార్టీ నాయకులున్నారని సమాచారం.

జిల్లాలో 20 వేల సంఘాలు

జిల్లాలో సుమారు 20 వేల స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటిలో సుమారు రెండు లక్షల నుంచి రెండు లక్షల యాభై వేల మంది సభ్యులుంటారని అంచనా. ఒక్కో నియోజకవర్గంలో 35 వేల నుంచి 40 వేల మంది ఓటర్లుంటారు. వచ్చే ఎన్నికల్లో వీరి ఓట్లు అత్యంత కీలకం కావడంతో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవక ముందే వీరిని మచ్చిక చేసుకునేందుకు వైసీపీ నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారు. అభ్యర్థుల ప్రకటన పూర్తయిన వెంటనే వీరికి తాయిలాలు అందించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముందుగా పూర్తిస్థాయిలో సమాచారం సేకరిస్తే తాయిలాల పంపిణీ ప్రక్రియ సులభమవుతుందని భావిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తరువాత తాయిలాల పంపిణీలపై నిఘా ఉంటుందన్న ఉద్దేశంతో ముందుగానే రంగంలోకి ... మిగతా 6వ పేజీలో

వైభవంగా శ్రీరామ రథయాత్ర

- సాగరతీరానికి భారీగా తరలివచ్చిన భక్తులు



రథయాత్రలో సీతారామ చంద్రుల విగ్రహాలు



అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా తీరంలోని కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, బీజేపీ నేతలు విష్ణు కుమార్‌రాజు, మాధవ్, జనసేన నాయకులు పంచకర్ల రమేశ్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, మూర్తి యాదవ్, పీవీఎస్ఎన్ రాజు, భక్తులు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలో శ్రీరామ మందిర ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని సాగర తీరంలోని ఆర్కే బీచ్ కాళీమాత గుడి నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకు ఆదివారం శ్రీరామ రథయాత్రను నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ సాగినయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని.. జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు. కోలాటం, భజనలు, కేరళ వాయిద్య బృందాల మధ్య వైభవంగా యాత్ర సాగింది. జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ ఆధ్వర్యంలో జరిగిన రథయాత్రలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌యాదవ్, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, జనసేన నేతలు కోన తాతారావు, పీవీఎస్ఎన్ రాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అడుగడుగునా నిర్బంధం

- అంగన్‌వాడీలు విజయవాడకు వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు
- సిబ్బంది ఇళ్లను చుట్టుముట్టి... అడ్డగింత



ఎస్‌అండ్‌జీ నగర్‌లో అంగన్‌వాడీ కార్యకర్త ఇంటి వద్ద పోలీసు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధనకై నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది సోమవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద బైఠాయింపునకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో విజయవాడకు బయలుదేరిన సిబ్బందిని పోలీసులు ఎక్కడికక్కడే నిర్బంధిస్తున్నారు. నగర పరిధిలోని పలువురు సిబ్బంది ఇళ్లకు వెళ్లి, వారు బయటకు రాకుండా నిర్బంధించారు. అసోసియేషన్ నగర అధ్యక్షురాలు నూకరత్నం, నాయకురాలు సుజాత, దేవి తదితరుల ఇళ్లకు వెళ్లిన పోలీసులు వారితో బలవంతంగా సంతకాలు చేయించుకునేందుకు యత్నించారు. విజయవాడకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల కళ్లు గప్పి బస్సులో విజయవాడకు వెళ్తున్న పదిమందిని రేవిడి వద్ద అడ్డుకున్నారు. వారిని బస్సు నుంచి కిందకు దించి ఇళ్లకు వెళ్లమని ఒత్తిడి చేశారు. ఈ చర్యలపై అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షురాలు మణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్నకు చెబుదాం పేరుతో కోటి సంతకాలను సేకరించామని, వాటిని విజయవాడకు వెళ్లి అందించేందుకు కూడా అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఏళ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బందిని ప్రభుత్వం, పోలీసులు సంఘ విద్రోహ శక్తులుగా చూడడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు.

సిలబస్ పూర్తికాకుండానే ఫార్మేటివ్ పరీక్షలా?

వరుస సెలవులతో తరగతుల నిర్వహణకు అవాంతరాలు

- అయినా పట్టించుకోని పాఠశాల విద్యా శాఖ
- పరీక్షలపై విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన



విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఈనెల 23 నుంచి ఫార్మేటివ్-3 పరీక్షలు నిర్వహించాలని షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఈ పరీక్షలకు సంబంధించిన సిలబస్ ఇంకా పూర్తికాకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో పాఠశాల విద్యాశాఖ పరిధిలోని పాఠశాలల్లో బోధనకు ఎస్‌సీఆర్‌టీ ప్రణాళిక రూపొందిస్తోంది. దీని ప్రకారం ఏటా నిర్వహించే సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షలకు సంబంధించి షెడ్యూల్ ఖరారు చేస్తారు. ప్రతి పాఠ్యాంశంలో నిర్దీత చాప్టర్లను విద్యార్థులకు బోధించిన తరువాత పరీక్షలు నిర్వహిస్తారు. తొలుత రెండు ఫార్మేటివ్ పరీక్షలు నిర్వహించిన తరువాత దసరా సెలవులకు ముందు లేదా తరువాత సమ్మేటివ్ పరీక్షలు, సంక్రాంతి సెలవులకు ముందు, లేదా తరువాత ఫార్మేటివ్, ఫిబ్రవరిలో సమ్మేటివ్ పరీక్షలు ఉంటాయి. సిలబస్ పూర్తియిన తరువాత వార్షిక పరీక్షలు నిర్వహిస్తారు.

గత ఏడాది నవంబరు రెండోవారంలో సమ్మేటివ్-1 పరీక్షలు ... మిగతా 6వ పేజీలో

క్లాప్ వాహనాల ఇష్టారాజ్యం

కాంట్రాక్టర్‌కు డబ్బులు... నగరవాసులకు తిప్పలు

- నెలకు రూ.3.75 కోట్లు చెల్లిస్తున్న జీవీఎంసీ
- మొక్కుబడిగా ఇళ్ల నుంచి చెత్తసేకరణ
- రోజుకి మూడు ట్రిప్పులు తిరగాల్సి ఉండగా ఒకటి, రెండుతో సరి
- ఒక ట్రిప్పులో కనీసం 700 కిలోల చెత్త ఉండాలన్న నిబంధన బేఖాతర్
- 250 కేజీల చెత్త మాత్రమే తరలింపు
- కార్మికుల సమ్మె విరమణ తరువాత పరిస్థితి మరింత దారుణం
- కమిషనర్, ఇతర అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే కారణం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి చెత్తసేకరిస్తున్న క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహనాల పనితీరు దారుణంగా మారింది. నగరంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించేందుకు 586 వాహనాలున్నప్పటికీ ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తుండడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ప్రతి రోజు డంపింగ్ యార్డుకు మూడు ట్రిప్పులు తిరగాల్సిన క్లాప్ వాహనాలు, ఒకటి...రెండు ట్రిప్పులతో సరిపెట్టేయడమే దీనికి కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనాలు ఇళ్లకు రాకపోవడంతో ప్రజలు చెత్తను రోడ్లపై పడేస్తున్నారు. పారిశుధ్య కార్మికుల సమ్మె విరమణ తర్వాత క్లాప్‌వాహనాల పనితీరు మరింత దారుణంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.



నగరపాలక సంస్థకు కేటాయించిన చెత్త తరలింపు వాహనాలు



ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)కు శ్రీకారం చుట్టింది. వెయ్యి ఇళ్లకు ఒకటి చొప్పున టాటా ఏస్ వాహనాలను కేటాయించింది. ఒక్కో వాహనానికి నెలకు రూ.64 వేలు చొప్పున ఆయా స్థానిక సంస్థలే చెల్లించేలా గ్లోబెల్ టెండర్ ద్వారా కాంట్రాక్టర్‌ను సమకూర్చింది. ఇందులో భాగంగా జీవీఎంసీకి 586 వాహనాలను కేటాయించింది. ఒక్కో వాహనానికి రూ.64వేలు చొప్పున నెలకు రూ.3.75 కోట్లు కాంట్రాక్టర్‌కు చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని ప్రజల నుంచి యూజర్‌ఛార్జీల రూపంలో వసూలు చేసి సర్దుబాటు చేయాలని సూచించింది. జీవీఎంసీకి అప్పగించిన వాహనాలను ప్రతి వార్డు సచివాలయానికి ఒకటి చొప్పున కేటాయించారు. ఇవి ప్రతి ఇంటికీ వెళ్లి రోజూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి. లోడు నిండిన తర్వాత సమీపంలోని ఎంఎస్ఎఫ్ యార్డుకు తరలించాలి. ఒక్కో వాహనం రోజుకు మూడు ట్రిప్పులు, మొత్తం 2,100 కిలోల చెత్తను తరలించాల్సి ఉండగా ఇష్టానుసారం నడుస్తున్నాయి.

కనిపించని అధికారుల పర్యవేక్షణ

క్లాప్ వాహనాలు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి వీటి పర్యవేక్షణపై అధికారుల్లో సమన్వయం కొరవడింది. ఈ పనులు అదనపు భారంగా మారాయని వార్డు ... మిగతా 6వ పేజీలో

నేడు ఓటర్ల తుది జాబితా

విడుదల చేయనున్న అధికారులు

- జిల్లాలో మొత్తం పోలింగ్ బూత్‌లు 1,941
- ప్రతి బూత్‌కు 12 సెట్ల జాబితాలు
- రాజకీయపార్టీల నేతలకు అందించేందుకు రంగం సిద్ధం
- జాబితాలో ఓటు లేకుంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల తుది జాబితా (ఎస్ఎస్ఆర్-2024) సోమవారం విడుదల కానుంది. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓటర్ల జాబితాల ముద్రణ ఇప్పటికే పూర్తయింది. మొత్తం 1,941 పోలింగ్ బూత్‌లు ఉండగా ప్రతి బూత్‌కు 12 సెట్ల ఓటర్ల జాబితాలను సిద్ధం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ప్రతి బూత్‌కు 12 సెట్లు చొప్పున మొత్తం 9.6 లక్షల పేజీలు ముద్రించారు. ప్రతి ఏటా జనవరిలో ప్రత్యేక సవరణ ఓటర్ల జాబితా విడుదల చేస్తారు. దీనికి మూడు నెలల ముందుగా అంటే అక్టోబరులో ముసాయిదా జాబితా రూపొందించి ఓటర్లకు అందుబాటులోకి తీసుకువస్తారు. గత ఏడాది అక్టోబరు 27న విడులచేసిన ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కలిపి 19,15,682 మంది ఓటర్లు న్నారు. ముసాయిదా జాబితాను పరిగణనలో తీసుకుని ఓటు నమోదు, తొలగింపులు, సవరణకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిష్కరించిన నేపథ్యంలో వారం క్రితం జిల్లాలో 19,41,923 ఓటర్లున్నట్టు అధికారులు అంచనాకు వచ్చారు. బహుశా ఇదే సంఖ్యకు అటూ ఇటుగా సవరణలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

సోమవారం మధ్యాహ్నం రాజకీయపార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశమై ఓటర్ల వివరాలు అందజేస్తారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి తన పరిధిలోని రాజకీయపార్టీల నేతలు జాబితాలు ఇవ్వనున్నారు. అదే సమయంలో బూత్‌ల వారీగా జాబితాలు అందుబాటులో ఉంచుతారు. ఓటర్లు తమ పరిధిలోని బూత్‌లెవెల్ అధికారిని సంప్రదించి ఓటు వివరాలు తెలుసుకోవచ్చు లేదా సీఈవో ఆంధ్రా.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి తెలుసుకోవచ్చు లేదా సెల్‌ఫోన్‌లో ఓటర్‌హెల్ప్‌లైన్ యాప్ ద్వారా గుర్తించవచ్చు. ఒకవేళ ఎవరి ఓటు అయినా గల్లంతైతే కొత్తగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తారు.

ఎక్సలెన్స్!

మానసిక ఆస్పత్రిలో పూర్తైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనులు

- రూ.29.6 కోట్లతో అప్‌గ్రేడ్ చేసిన కేంద్రం
- ప్రారంభోత్సవానికి అధికారుల సన్నాహాలు
- అందుబాటులోకి రానున్న మూడు కోర్సులు.. 90 సీట్లు
- మరో 60 పడకలతో వైద్య సేవలకు అవకాశం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

నగరంలోని మానసిక ఆస్పత్రి అప్‌గ్రేడేషన్‌లో భాగంగా చేపట్టిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పనులు పూర్తయ్యాయి. దేశ వ్యాప్తంగా మానసిక సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగంలో నిపుణులను పెంచడంతోపాటు ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్రం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే దేశవ్యాప్తంగా కీలకమైన మానసిక ఆస్పత్రులను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పేరుతో అప్‌గ్రేడ్ చేసింది.



సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భాగంగా నిర్మాణాలు పూర్తయిన భవనాలు

రాష్ట్రవ్యాప్తంగా నగరంలో ఉన్న ఏకైక మానసిక ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసేందుకు కేంద్రం నిర్ణయించింది. ఇందుకు గాను రూ.29.6 కోట్లు అవసరమని ప్రతిపాదించగా కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వ్యయాన్ని భరించాయి. ఐదేళ్ల కిందట పెదవాల్తేరులోని మానసిక ఆస్పత్రికి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ప్రారంభించిన భవన భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. దీంతో ప్రారంభోత్సవానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కొత్తగా నిర్మించిన ఐదు భవనాల్లో పలు వార్డులు, మూడు విభాగాలతో పాటు పరిపాలన వ్యవహారాలకు కూడా నిర్వహించనున్నారు.

మూడు కోర్సులు.. నాలుగు వార్డులు..

మానసిక ఆస్పత్రిని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అప్‌గ్రేడేషన్ చేయడం వల్ల రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ రామిరెడ్డి చెబుతున్నారు. సైకియాట్రిక్ నర్సింగ్, క్లినికల్ సైకాలజీ, సైకియాట్రిక్ సోషల్‌వర్క్ విభాగాలను నిర్వహించనున్నారు. ఒక్కో విభాగంలో 30 మందికి అడ్మిషన్లు ఇవ్వనున్నారు. కోర్సుల నిర్వహణ బాధ్యతను రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఆర్‌సీఐ)కు అప్పగించాలని అధికారులు దరఖాస్తు చేశారు. కొద్దిరోజుల్లో ... మిగతా 6వ పేజీలో

మెరుగైన వైద్యానికి అవకాశం

మెరుగైన వైద్యాన్ని అందించేందుకు అవకాశం ఉంటుంది. కొన్నాళ్లుగా పెరుగుతున్న మానసిక సమస్యలను దృష్టి ఉంచుకుని కొత్త కోర్సుల నిర్వహణకు వీలుంటుంది. పలు వార్డులు అందుబాటులోకి వస్తాయి. ఆర్‌సీఐ అనుమతి వచ్చిన వెంటనే అడ్మిషన్స్ నిర్వహిస్తాం. భవన ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తామని కలెక్టర్ తెలిపారు.

\- డాక్టర్ కేవీ రామిరెడ్డి, మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్



రాష్ట్రంలో పోలీస్ రాజ్యం

ప్రస్తుత పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి

- ఎడాపెడా అప్పులతో రాష్ట్రం దివాలా
- ఏపీని కాపాడుకోవడానికి మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చాను
- మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ
- జనసేన పార్టీలో చేరనున్నట్టు వెల్లడి

సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

- వివరాలు మెయిన్ 12వ పేజీలో

నేటి నుంచి పోలమాంబ పరస ఉత్సవాలు


పోలమాంబ అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 21: గ్రేటర్ 30వ వార్డు పరిధిలోని కుమ్మరవీధి పోలమాంబ అమ్మవారి పరస మహోత్సవాలకు సర్వసిద్ధమైంది. సోమవారం తొలేళ్ల పురస్కరించుకుని ఉదయం అమ్మవారికి ప సుపు అద్దకంతో ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం మహిళలు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి జలంతో అభిషేకం జరుపుతారు. రాత్రి 7 గంటలకు కమిటీ నివేదిక, పుర ప్రజలకు సత్కారం, పేద మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నట్టు శ్రీ పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా ఉంటుంది. 23న మంగళవారం పరస ఉత్సవంలో భాగంగా అర్ధరాత్రి 12 గంటల తర్వాత అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు జరిపి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిప్పుల గుండం, సాముగరిడీలు, దాసుళ్ల సందడి,కోలాటాలు, పులివేషాలు తదితర సాంస్కృతిక కార్యక్ర మాలుంటాయి. వాచ్ హౌస్ వద్ద లేరారే జానపద గీతాల ప్రదర్శన ఉంటుందని కమిటీ తెలిపింది. 24 తేదీన అన్న సమారాధన ఉంటుంది. భక్తులకు ఇబ్బం దు లు తలెత్తకుండామహారాణిపేట పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు ఏ ర్పాటు చేస్తున్నారు. ఆలయ కమిటీ వలంటీర్లు సేవలందజేయనున్నారు.

బాలికలకు తోడ్పాటు అందించాలి


జాతీయ బాలికల దినోత్సవ ర్యాలీలో ప్రతినిధులు

బీచ్‌రోడ్డు, జనవరి 21: బాలికలు సమాజంలో సమస్యలు, సవాళ్లను అధిగమించేలా వారికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని స్వచ్ఛంద సంస్థ క్రై చైల్డ్ రైట్స్ అండ్ యూ ప్రతినిధులు కోరారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్ రో డ్డులో 'వాక్ టూ ఎంపవర్ హెర్' అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ బాలిక దినోత్సవం ప్రాధాన్యం పురష్కరించుకుని ఈ ర్యాలీ చేపట్టినట్టు చెప్పారు. బాలికలు ఎదుర్కొంటున్న విద్య, రక్షణ, ఆరోగ్యం సవాళ్లపై పౌర సమాజంలో అవగాహన పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో వైజాగ్ చాప్టర్ చర్మన్ హర్షనందన్ , సునీల్, జి. సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏయూను జగనన్న యూనివర్సిటీగా మార్చండి

▸▸ జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు ఎద్దేవా


విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏయూ పేరును జగనన్న యూనివర్శిటీగా మారుస్తూ ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని, వీసీ ప్రసాదరెడ్డిని ఉత్తరాంధ్ర స్టార్ క్యాంపెయినర్‌గా నియమించాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు ఎద్దేవా చేశారు. ఏయూ వీసీగా రెండోసారి ప్రసాదరెడ్డిని నియమించిన నేపథ్యంలో ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ క్రియాశీలక రాజకీయాల్లో కీలక వ్యక్తిగా వ్యవహరిస్తున్న ప్రసాదరెడ్డిని రెండోసారి వైస్ చాన్సలర్‌గా నియమించడాన్ని జన జాగరణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఏయూను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర పార్టీ కార్యాలయంగా మార్చుకుని భ్రష్టు పట్టించిందన్నారు. వీసీ బాధ్యతల స్వీకరణకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొని ఆహ్వానించడాన్ని చూస్తే.. వర్శిటీ వీసీగా కంటే వైసీపీ వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీక రించిన ట్టుగా ఉందనివిమర్శించారు.ప్రసాదరెడ్డినిరెండోసారి వీసీగా గవర్నర్ నియమించడాన్నివిద్యావంతులు, మేధావులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారన్నారు.

పోలీసు క్వార్టర్స్‌ను మరమ్మతు చేపట్టాలి: సీపీ


కరాసలో క్వార్టర్స్ పరిశీలిస్తున్న సీపీ

మర్రిపాలెం, జనవరి 21: విశాఖ పోలీసు కమిషనర్ ఏ రవి శంకర్ ఆదివారం ఎయిర్ పోర్టు పోలీసు స్టేషన్ పరిధి మర్రిపాలెం కరాసలోని పోలీసు క్వార్టర్స్‌ను సందర్శించారు. క్వార్టర్స్‌లోని అన్ని భవనాలను పరిశీలిం చారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను త్వ రతగతిన మరమ్మ తులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, డ్రైనేజీ సమస్యలను పరి ష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, ఏసీపీలు ఆర్మడ్ రిజర్వ్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సంఘం కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గ సభ్యులు

విశాఖప ట్నం (స్పో ర్ట్సు), జనవరి 21: విశాఖపట్నం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. నగరంలో ఓ హోటల్లో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్.కేశవ, కోశాధికారిగా ఎన్.గురివినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఆర్‌వీఎల్ఎన్.రత్నాకరరావు, కేవీ రమణ, ఏ రామారావు, సీ పండు శంకర్, సంయుక్త కార్యదర్శులుగా డీ శంకరరావు, వీ శ్రీధర్, ఎస్‌వీ.రమణ, బీ రమేష్‌కుమార్‌తోపాటు ఏడు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షుడు కంచరాన సూర్యనారాయణ గౌరవ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ ఎన్నిక పర్యవేక్షకుడిగా రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంఘం ప్రతినిధి బడేటి వెంకటరామయ్య, ద ఒలింపిక్ సంఘం ప్రతినిధులు ఎస్.గోపీకృష్ణ, ఆర్.వెంకటరావు, బొజ్జా రామయ్య వ్యవహరించగా, ఎన్నికల అధికారిగా కూన వెంకటరమణ ఉన్నారు.

రైళ్లకు తగ్గని సంక్రాంతి ప్రయాణికుల తాకిడి

▸▸ తిరుగు ప్రయాణంలో అవస్థలు ▸▸ రిజర్వేషన్ కోచ్‌ల్లోనూ రద్దీ


రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

విశాఖపట్నం, జనవరి 21: సంక్రాంతి తిరుగు ప్రయాణికులపై రైళ్ల రద్దు ప్రభావం తీవ్రంగా చూపుతోంది. రైళ్లన్నీ జనాలతో కిక్కిరిసినడుస్తున్నాయి. పండుగ ముగించుకుని గమ్యాలకు చేరేందుకు ఆదివారం స్టేషన్‌కు చేరుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్లాట్‌ఫామ్‌లన్నీ జనాలతో కిటకిటలాడాయి. ఏ రైలులో కూడా లోపలికి ప్రవేశించే అవకాశం లేకపోవడంతో ది క్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నారు. పిల్లాపాపలతో స్టేషన్‌కు చేరిన కొందరు రద్దీకి భయపడి ప్రయాణాన్ని వాయిదా వేసుకుని తిరిగి ఇంటి ముఖం పట్టారు. మరికొందరు మరో రైలు కోసం ని రీక్షిస్తూ కనిపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు రద్దీని ఎదుర్కొని గమ్యాలకు చేరేందుకు ప్రయత్నించారు. విశాఖనుంచి ఉత్తరాంధ్ర ప్రాంతాలతోపాటు భువనేశ్వర్, రాయగడ, రాయపూర్, కోరాపుట్ ప్రాంతాలకు వెళ్లే రైళ్లతోపాటు రాజమండ్రి, విజయవాడ, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలకు బయలుదేరే అన్ని రైళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రిజర్వేషన్ కోచ్‌లు కూడా సాధారణ కోచ్‌లు తలపించే విధంగా కిక్కిరిసి నడవడం గమనార్హం.

రైళ్ల రద్దు ప్రభావం

రైళ్ల రద్దు ప్రభావం... ఆదివారం పండుగ తిరుగు ప్రయాణికులపై స్పష్టంగా కనిపించింది. వాల్తేరు డివిజన్ పరిధిలోని సింగపూర్ రోడ్డు, రాయగడ స్టేషన్ల మధ్య మూడో లైను నాన్ ఇం టర్ లాకింగ్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ-రాయపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ రైళ్లు (08528/08527), విశాఖ-భవానీపట్న- విశాఖ ప్రత్యేక రైళ్లు (08504/08503), విశాఖ-కోరాపుట్-విశాఖ ప్రత్యేక పాసింజర్ రైళ్లు (08546/08545), విశాఖ-కోరాపుట్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (08512/08511)తోపాటు తిరుపతి- బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (174 82/17481) రైళ్లను రద్దు చేయడంతో ఆ ప్రభావం ఉత్తరాంధ్రతోపాటు ఒడిశాలోని తెలుగు ప్రజలు నివసించే ప్రాంతాలపై చూపింది.

ఇక, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ సెక్షన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్నందున విశాఖ, గుంటూరు మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు (17239/17240), విశాఖ - విజయవాడ/గుంటూరు-విశాఖ మధ్య నడిచే ఉదయ్ ఎక్స్ ప్రెస్ సర్వీసులు (22701/ 22702) రద్దుతో కోస్తాంధ్రలోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరు జిల్లాకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. ఆదివారం ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805)తోపాటు మధ్యాహ్నం బయలుదేరే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488)లకు తీవ్ర రద్దీ నెలకొంది. ఇక, సోమవారం తప్పనిసరిగా విద్య, వ్యాపార, ఉద్యోగాల్లో చే రాల్సిన వారు సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు బయలుదేరడంతో విశాఖ నుంచి వెళ్లే.. గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), దురంతో (22203), గరీబ్‌రథ్(12739), విశాఖ-సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12783), ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) వంటి ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), సంబల్‌పూర్-నాందేడు (20 809), కో ణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) రైళ్లు రద్దీగా నడిచాయి. రిజర్వేషన్ బోగీలు జనరల్ కోచ్‌లను తలపించేలా కిటకిటలాడాయి.

నగరంలో వైసీపీ నాయకుల భూ దోపిడీ

▸▸ రామానాయుడు స్టూడియో భూముల స్వాహాకు యత్నం
▸▸ అందులో భాగంగానే వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు
▸▸ టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


మాట్లాడుతున్న పల్లా

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌రోడ్‌లో రామానాయుడు స్టూడియోకు కేటా యించిన 34.44 ఎకరాల భూముల దోపిడీకి అధికార పార్టీ పెద్దలు వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను మార్పు చేశారని టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం ఆయన నగరంలోని పార్టీ కార్యాల యంలో విలేక రులతో మాట్లాడారు. విశాఖలో సినీ పరిశ్రమ విస్తరణ కోసం 2003లోఅప్పటి సీఎం చంద్రబాబునాయుడు 34.44 ఎకరాలు రామానాయుడుకు కేటాయించారని గుర్తుచేశారు. అయితే ఇక్కడి విలువైన భూములను బెదిరించి దోచుకున్న వైసీపీలోని కీలకవ్యక్తులు, స్టూడియో ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాల లేఅవుట్‌కు జీవీఎంసీ అనుమతి ఇచ్చిందన్నారు. దీనిపై తమ పార్టీకి చెందిన తూర్పుఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు సుప్రీంకోర్టులో కేసు వేశారని చెప్పారు. స్టూడియోను రిక్రియేషన్ కోసం తప్ప ఇతరత్రా అవసరాలకు వినియోగించరాదని కోర్టు స్టే ఇచ్చి మొట్టికాయలు వేసిందన్నారు. నగరంలో విలువైన భూ ములు దోచుకున్న వైసీపీ నాయ కులు, వారితో పాటు తమ అనుయాయులకు చెందిన భూములకు ప్రయోజనం కలిగేలా వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను ఇష్టానుసారం మార్చేశారని ఆరోపించారు. గాజువాకలో పాత గాజువాక జంక్షన్ నుంచి టోలుగేటు వరకు మాస్టర్‌ప్లాన్ మార్పులు చేసి రోడ్‌కు అవసరమైన భూసేకరణ లో అస్మదీయులకు టీడీఆర్‌లు జారీకి ప్రయ త్నా లు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సిరిపురం నుంచి ఆశీలమెట్ట వరకు రోడ్ విస్తరణకు అనువు గా మాస్టర్ ప్లాన్ మార్చడంతో సీబీసీఎన్‌సీకి భారీ లబ్ధి చేకూర్చారన్నారు. విశాఖ - భీమిలి బీచ్ రోడ్‌ను ఎస్‌వోఎస్‌విలేజీ జంక్షన్ నుంచి విజయ సాయిరెడ్డి భూములున్న ప్రాంతం మీదుగా మార్పులు చేశారన్నారు. పెద జాలారిపేటకు వెళ్లే పెద వాల్తేర్ జం క్షన్‌కు ఆనుకుని భారీ బహుళ అంతస్తు కోసం ప్లాన్ ను మార్పు చేశారని, ఇలా అనేకచోట్ల తమకు అనుకూలంగా మార్పులు చేశారన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ లో అక్రమాలపై విచారణ చేపడతా మన్నారు. అక్రమంగా టీడీఆర్‌లు పొందిన వారిని జైలుకు పంపిస్తా మని హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో అక్ర మాలపై అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసు కోకపో వడం దారుణమన్నారు.

తిరుగు ప్రయాణికులకు 73 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, జనవరి 21: సంక్రాంతికి స్వస్థలాలకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యే వారికోసం ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం ఆదివారం 73 ప్రత్యేక సర్వీసులను ఆపరేట్ చేసింది. విశాఖ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపింది. హైదరాబాద్‌కు 8, విజయవాడకు 25, రాజమండ్రికి 40 స్పెషల్ సర్వీసులు నడిపింది. ఈ ప్రాంతాలకు సాధారణ షెడ్యూల్స్ ఉన్నా, వాటి సీటింగ్ కెపాసిటీకి మించి ప్రయాణికుల డిమాండ్ ఉండటంతో ఈ ప్రత్యేక సర్వీసులు నడిపింది. మధ్యాహ్నం నుంచి రాత్రి 8.00 గంటల వరకు ఈ బస్సులు నడిపారు. సోమవారం నుంచి సంక్రాంతి తిరుగుప్రయాణికుల డిమాండ్ తగ్గే అవకాశమున్నట్టు ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

జనసేన సభ్యత్వ కార్డులు జారీ


కార్డులందిస్తున్న వార్డు అధ్యక్షుడు అప్పారావు

మురళీనగర్, జనవరి 21; మాధవధార కళింగ నగర్‌లో ఆదివారం జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా 51వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు జి.అప్పారావు మాట్లాడుతూ, పార్టీ అధికారికంగా జారీ చేసిన సభ్యుని ఫొటో , వివరాలతో కూడిన ఐడెంటిటీ కార్డుని పోలింగ్ బూత్‌ల వారీగా అందించామన్నారు.ఈ సభ్యులంతా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఓటర్లను చైతన్యం చేసే దిశగా ముందుకి సాగాలన్నారు. వైసీపీ పాలనలోని అరాచకాలను వివరించాలని సూచించారు. కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఉన్నారు.

భారత రాజ్యాంగం ఎంతో విశిష్టమైంది

▸▸ వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు కె. రమాప్రభ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, జనవరి 21: భారత రాజ్యాంగం ఎంతో విశిష్టమైనదని వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డా.కె.రమాప్రభ అన్నారు. ఆదివారం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు 'ప్రతి హృదయంలో రాజ్యాంగం' అనే నినాదంతో బాలలతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలంతా కుల, మత, భాషా, లింగ, ప్రాంత, జాతి తారతమ్యంలేకుండా అందరూ సమానమేనని రాజ్యాంగంలో పేర్కొన్నట్టు చెప్పారు. రాజ్యాంగ రూపకర్త డా.బి.ఆర్.అంబేడ్కర్ బాల్యంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. అన్నిటినీ ఎదిరించి అణగారిన వర్గాలను విముక్తికి పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ కో ఆర్డినేటర్ వేణు, మోదాంబిక, ఎస్.హరిత, జాహ్నవి, అలేఖ్య, కొండమ్మ, అప్పారావు, కృష్ణారావు, స్వర్ణలత, అప్పలకొండ, గుణశంకర్, సరోజినిదేవిపాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీల్లో బలమైన ఐక్యత అవసరం

▸▸ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు 'చలసాని'


లెనిన్‌పై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్, జనవరి 21: దేశంలోని కమ్యూనిస్టు పార్టీల్లో బలమైన ఐక్యతను తీసుకురావాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రాఘవేంద్రరావు అభిప్రాయపడ్డారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సభ మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ, దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు రానున్న కాలంలో ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరముందన్నారు. 17 ఏళ్ల వయస్సులోనే జార్ చక్రవర్తి నిర్బంధాన్ని లెనిన్ ఎదుర్కొన్నారని తెలిపారు. మానవాళి కోసం రూపొందించిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. మాజీ ఎమ్మెల్సీ శర్మ మాట్లాడుతూ, ప్రపంచంలో దోపిడీ రాజ్యాలను కూల్చి కార్మిక రాజ్యాలను స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు, సీఎన్ క్షేత్రపాల్ ఉన్నారు.

ప్రజల మదిలో లెనిన్ సుస్థిరస్థానం

మాధవధార; రష్యాలో జరిగిన విప్లవంలో లెనిన్ ప్రముఖ పాత్ర వహించి ప్రపంచానికి ఆదర్శ ప్రాయులయ్యారని అమరావతి విశ్వసాహితి సమితి మాధవధార బృందానికి చెందిన కవి చిన్న చూర్యనారాయణ అన్నారు. మాధవధార భరద్వాజ కళాక్షేత్రంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా పలువురు లెనిన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత విశేషాల పుస్తకాలను సభలో హాజరైన వారికి అందించారు.

డ్వాక్రా సంఘాలకు వైసీపీ వల!

... 5వ పేజీ తరువాయి

దిగారని చెబుతున్నారు.

సహకరిస్తున్న యంత్రాంగం

ఇప్పటికే సీఎం జగన్‌తోపాటు నియోజకవర్గ నేతలు నిర్వహించే సభలు, సమావేశాలకు డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలను పెద్దఎత్తున తరలిస్తున్నారు. ఇందుకు అధికారులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారు. ఆయా సభలకు మహిళలను తరలించడంలో కీలకపాత్ర పోషించిన అధికారులపై నియోజకవర్గ ఇన్‌చార్జిలు దృష్టిసారించారు. ఏళ్ల తరబడి మెప్మాలో పనిచేస్తున్న కొందరు అధికారులకు వందలాది సంఘాలు, ఆర్పీలపై పట్టుంది. వీరికి పెద్ద మొత్తంలో మేలు చేయడం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో మెజారిటీ మహిళలను తమ వైపు తిప్పుకుని, వారి ఓట్లను కొల్లగొట్టవచ్చని వైసీపీ నేతలు భావిస్తున్నారు.

సభ్యులకు తాయిలాల ఎర..

స్వయం సహాయక సంఘాల్లో పనిచేసే అధికారుల నుంచి సభ్యుల వరకు ప్రతి ఒక్కరికీ ఎన్నికల ముందు పెద్దఎత్తున తాయిలాలు పంపిణీ చేస్తే భారీగా ఓట్లు పడతాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు. ఎన్నికల వరకు వేచి ఉంటే అంతగా ఫలితం ఉండదని, ముందుగానే తమవైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. ఈ క్రమంలో వివరాల సేకరణను వేగవంతం చేస్తున్నారు. వైసీపీ నేతలు అందించే తాయిలాలు సభ్యులు, ఇతర అధికారులు తీసుకుంటారా అనేది చూడాల్సి ఉంది. అయితే అధికార పార్టీ నాయకులకు అధికారుల సహకారం లభిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరహా చర్యలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

క్లాప్ వాహనాల ఇష్టారాజ్యం!

... 5వ పేజీ తరువాయి

సచివాలయ సిబ్బంది క్లాప్ వాహనాలను పట్టించుకోవడం మానేశారు. జీవీఎంసీ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినపుడు క్లాప్ వాహనాలు కనిపించినా, లోతుగా ఆరా తీసిన సందర్భం లేదు. ఇతర అధికారులు కూడా పట్టించుకోవడం మానేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్, వాహనాల డ్రైవర్లను అడిగేవారు లేకుండాపోయారు. తమకు నచ్చినట్టు ఒకటి, రెండు ట్రిప్పులు చెత్తసేకరించి చేతులు దులుపుకుంటున్నారు. అంతేకాదు ఒక్కో ట్రిప్పులో కనీసం 700 కిలోల చెత్త తరలించాలనే నిబంధన ఉన్నప్పటికీ 250-300 కిలోలతోనే ఎంఎస్ఎఫ్‌లకు వాహనాలు వెళ్తున్నాయి.

ముడసర్లోవ ఎంఎస్ఎఫ్‌యార్డులోని తూకంయంత్రం వద్ద పనిచేసే సిబ్బంది వద్ద రికార్డులను పరిశీలిస్తే జోన్-2 పరిధిలో తిరుగుతున్న వాహనాల్లో ఒకటి, రెండు మినహా మిగిలినవేవీ మూడు ట్రిప్పులు తిరిగినట్టు లేదు. నగరంలోని మిగిలిన అన్ని యార్డుల వద్ద పరిస్థితి ఇలాగే ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా బిల్లులు చెల్లించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

నగరవాసులకు తిప్పలు

ఇంటింటికీ చెత్త సేకరణ సరిగా జరగకపోవడం, వాహనాలు వచ్చివెళ్లిన సమాచారం కూడా లేకపోవడంతో ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేస్తున్నారు. దీంతో రహదారుల పక్కన చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి వీటిని అలాగే వదిలేస్తుండడంతో దుర్గంధంతో పాటు పారిశుధ్య సమస్య ఎదురవుతోంది. పశువులు, కుక్కలు వాటిని చిందరవందర చేస్తుండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అదే సమయంలో చెత్త సేకరణ సక్రమంగా చేయనప్పటికీ కాంట్రాక్టర్‌కు మాత్రం జీవీఎంసీ ప్రతినెల ఠంచనుగా బిల్లులు చెల్లిస్తోంది. దీనివల్ల నెలనెలా రూ.కోట్లు ప్రజాధనం ఖర్చు అయిపోతున్నా... లక్ష్యం నెరవేరడం లేదు. పైగా గతంతో పోల్చితే నగరంలో పారిశుధ్యం పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. ఇటీవల కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. ఆ సమయంలో క్లాప్ వాహనాలను కూడా అడ్డుకోవడంతో నగరంలో చెత్తసేకరణ పూర్తిగా నిలిచిపోయింది. దాదాపు 15 రోజుల తర్వాత సమ్మె విరమించారు. కార్మికులు విధులకు హాజరవుతున్నప్పటికీ, క్లాప్ వాహనాలు వీధుల్లోకి రావడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో రోజుకు కనీసం ఒకటి, రెండు ట్రిప్పులైనా తిరిగేవని, ఇప్పుడు రెండు, మూడు రోజులకు ఒకసారి వస్తున్నాయని నిట్టూరుస్తున్నారు. దీనిపై అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ కాంట్రాక్టర్‌పై చర్యలకు వెనుకాడుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సిలబస్ పూర్తికాకుండానే ఫార్మేటివ్ పరీక్షలా?

... 5వ పేజీ తరువాయి

నిర్వహించారు. పలు కారణాలతో వారం రోజుల్లో ముగియాల్సిన ఈ పరీక్షలు రెండు వారాలకుపైగా సాగాయి. తరువాత తరగతుల నిర్వహణకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. తుఫాన్ కారణంగా సెలవులు, క్రిస్మస్, సంక్రాంతి సెలవులు, మధ్యలో ఆడుదాం ఆంధ్రాపేరుతో ఉన్నత పాఠశాలల్లో హడావిడి చేశారు. ఉన్నత పాఠశాలల మైదానాల్లో పోటీల నిర్వహణ, విద్యార్థులపై ఒత్తిడి తెచ్చి ఆటలాడించడం జరిగాయి. పైగా ఈ పోటీలు వచ్చేనెల వరకు కొనసాగనున్నాయి. దీంతో విద్యార్థులు ఆటలపై ఫోకస్ పెట్టారు. మొత్తంగా ఫార్మేటివ్-3కు సంబంధించిన సిలబస్ ఇంకా పూర్తికాలేదని ఉపాధ్యాయులే అంగీకరిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల వరకు పెద్దగా ఇబ్బందిలేకపోయినా ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు సన్నద్ధం కాలేదు. ఇక ప్రైవేటు పాఠశాలల విషయానికి వస్తే విద్యా సంవత్సరం మొదలైన మూడు నెలల్లోనే మొత్తం సిలబస్ బోధించేస్తారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో షెడ్యూల్ మేరకు బోధన సాగుతుంది. దీంతో ఫార్మేటివ్3 పరీక్షలు ఎలా రాస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై దృష్టిసారించకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించడాన్ని తల్లిదండ్రులు తప్పుబడుతున్నారు.

ఎక్సలెన్స్!

... 5వ పేజీ తరువాయి

అధికారుల బృందం తనిఖీలు నిర్వహించి, అనుమతి ఇవ్వనుంది. వచ్చే ఏడాది నుంచి కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టే అవకాశం దీనికి అనుసంధానంగా చైల్డ్ సైకియాట్రీ, జీరియాట్రిక్ సైకియాట్రీ (వృద్ధుల మానసిక సమస్యలకు సంబంధించినది), డీ అడిక్షన్ బ్లాక్, మనో వికాస కేంద్రం, అకడమిక్ బ్లాక్‌ను ఏర్పాటు చేయనున్నారు.


భారీగా పోస్టులు..

ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్స్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆఫీస్ సెక్షన్ నిర్వహించేందుకు వివిధ కేడర్లకు సంబంధించి 120 ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఇప్పటికే పరికరాలను కొనుగోలు చేశారు. రెండు ఈఈజీ మెషీన్లు (బ్రెయిన్ గ్రాఫ్‌ను తెలియజేసేది), నాలుగు ఈసీటీ మెషీన్లు (షాక్ ట్రీట్‌మెంట్‌కు వినియోగించేవి), 12 హై లెవెల్ కంప్యూటర్స్ వచ్చాయి.

'గాడి తప్పిన విద్యా వ్యవస్థ'పై 25న చర్చాగోష్ఠి

విశాఖపట్నం, జనవరి 21: నగరంలోని పౌర గ్రంథాలయంలో ఈనెల 25న గాడి తప్పిన విద్యా వ్యవస్థ అన్న అంశంపై చర్చా గోష్ఠి నిర్వహించనున్నట్టు జన చైతన్య వేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యూపీఎస్సీ పూర్వ ఇన్‌చార్జి చైర్మన్ ఆచార్య చలం, ప్రముఖ రాజనీతి ప్రొఫెసర్, ఏయూ పూర్వ రెక్టార్ ప్రసన్నకుమార్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వపు వైస్ చాన్సలర్ ఆచార్య కె. నిరూపరాణి, గీతం వర్సిటీ పూర్వ ప్రొ వైస్ చాన్సలర్ డి. హరినారాయణ, తదితరులు చర్చలో పాల్గొంటారని చెప్పారు.

ఉడా కాలనీలో ఆత్మీయ సమావేశం


మాట్లాడుతున్న బీజేపీ రా ష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, జనవరి 21 ; ఉత్తర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్ రాజు ఆదివారం ఉడాకాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ ప్రగతి, రాజకీయ పరిణామాలు, తదితర సమస్యలపై చర్చించారు. కాలనీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు అశోకచక్రవర్తి, రాధాకృష్ణ, 51వవార్డు టీడీపీ అధ్యక్షులు టి.శ్రీనివాసరావు, బిల్డర్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'అయోధ్యలో రామాలయ నిర్మాణం జాతికే గర్వకారణం'


మాధవరధారలో ప్రచారం చేస్తున్న సభ్యులు

మాధవధార, జనవరి 21 ; మాధవధారలో మానవ సేవే మాధవసేవ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మురళీ నగర్, మాధవధార ప్రాంతాల్లో జై శ్రీరామ్ నినాదాలతో అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవంపై ప్రచారం నిర్వహించారు. కాలనీల్లో ఇంటింటికీ శ్రీరామ అక్షతలు అందించారు. రామ మందిరం ఆరంభం రోజైన సోమవారం ఇళ్లల్లో పాటించాల్సిన నియమాలతో కరపత్రాలను అందించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.భానుప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు శ్రీ ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షులు డి.వరప్రసాద్, సెక్రటరీ ఎస్.సీతారామకృష్ణ, సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రామలింగేశ్వరాలయంలో దీపారాధన

అక్కయ్యపాలెం: అయోధ్యలో రామ్ లల్లా విగ్రహప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం పురస్కరించుకుని సోమవారం సాయంత్రం రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం వద్ద దీపారాధన జరుగనున్నట్లు 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కేవీ కుమార్ తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

మాధవధార: అయోధ్య శ్రీ రాముడి ఆలయ ప్రాణ ప్రతిష్ఠ జరగనున్ననేపథ్యంలో ఈనెల 22న సోమవారం సింహాచల దేవస్థానం ఉప ఆలయమైన మాధవధార పుణ్యక్షేత్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష హారతి చేపట్టనున్నట్టు అర్చకులు రాధాకృష్ణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీరామ నామం, పారాయణం ఉంటాయన్నారు.


గీతాభవన్‌లో పూజలు చేస్తున్న ప్రచార సమితి సభ్యులు

గీతా ప్రచార సమితి శ్రీరాముని సంకీర్తనలు

పూర్ణామార్కెట్: వన్‌టౌన్ గీతాభవన్‌లో ఆదివారం గీతా ప్రచార సమితి సభ్యులు సామూహిక శ్రీ రామ సంకీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామరక్ష స్తోత్రం తదితర ప్ర త్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించినట్టు సమితి ప్రతినిధులు సీహెచ్ విశ్వేశ్వరరావు తెలిపారు. అయోధ్యలో శ్రీరా ముని ప్రాణ ప్రతిష్ఠ అజేయంగా జరగాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మివేత్త రాజశేఖర్, ఎం.వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

విశాఖపట్నం, జనవరి 21: భూ హక్కు-23 చట్టం రద్దుచేయాలని కోరుతూ, రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు చేపడుతున్న విధుల బహిష్కరణ నిరసనను ఫిబ్రవరి 7వతేదీన కొనసాగించనున్నారు. ఉత్తరాంధ్ర న్యాయవాదుల విధుల బహిష్కరణ స్టీరింగ్ కమిటీ , న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆదివారం సమావేశమై ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. నెలరోజులుగా నిరసన తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ చట్టం వల్ల ప్రజలకు ఆస్తి హక్కు కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. కేం ద్రం ఒత్తిడి మేరకు ఈస్థితిలో ఫి బ్రవరి 7 తర్వాత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్టు ప్రకటించారు. అలాగే, దీనిపై హై కోర్టును ఆశ్రయించాలని తీర్మానించారు.

త్వరలో చుక్కవానిపాలెంలో ఫ్లైఓవర్ నిర్మాణం

ఆటోనగర్, జనవరి 21: ఆటోనగర్ డీ-బ్లాక్‌లోని చుక్కవానిపాలెం రైల్వే క్రాసింగ్ గేటు స్థానంలో ఫ్లైఓవర్ నిర్మించాలన్న ప్రజల కల త్వరలో సాకారం కానున్నది. పలువురు పారిశ్రామికవాసులు, ఆయా గ్రామాల ప్రజలు ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతున్న సంగతి తెలిసిందే. దశాబ్ద కాలంగా ఆటోనగర్ అభివృద్ధికి విఘాతంగా మారిన చుక్కవానిపాలెం సమీపంలోని రైల్వే క్రాసింగ్ గేటు స్థానంలో ఫ్లైఓవర్‌ను నిర్మించాలనే వివిధ పరిశ్రమల వర్గాల అభ్యర్థనకు ఎట్టకేలకు రైల్వే యంత్రాంగం స్పందించింది. ఆర్ఎంబీ డిపార్ట్‌మెంట్, నేషనల్ హైవేస్ అండ్ సీఆర్ఎఫ్ సేతుబంధన్ ప్రాజెక్టులో భాగంగా ఆటోనగర్‌లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులను రూ.26 కోట్లతో త్వరలో ప్రారంభిస్తామని ఐలా కమిషనర్ కె.జయచంద్ర, చైర్మన్ రఘు తెలిపారు.



రైల్వే గేటు పడడంతో వేచివున్న కార్మికులు, ఇతన వాహనదారులు

రూ.26 కోట్లతో పనులు చేపడతామన్న ఐలా కమిషనర్ జయచంద్ర

వంతెన నిర్మాణం పూర్తయితే ప్రజలు కష్టాలు తీరినట్టే..

ప్రజలు ఇబ్బందులు తీరుతాయి



ఆటోనగర్‌లోని రైల్ క్రాసింగ్ గేటును అధిక సమయం మూసి వేస్తుండడంతో వివిధ కర్మాగారాల నిర్వాహకులు, కార్మికులు, విద్యార్థులతో పాటు సమీప కాలనీల ప్రజలు నానాపాట్లు పడేవారు. ఇక్కడ వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని ఆటోనగర్ పరిశ్రమల తరపున పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంతో ఎట్టకేలకు వంతెన పనులను ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగింది. వంతెన నిర్మాణం పూర్తయితే ప్రజలతో పాటు పారిశ్రామికవేత్తల ఇక్కట్లు తీరుతాయి.

-ఎస్.పాండురంగప్రసాద్, గ్రీన్‌సిటీ

త్వరలో పనులు ప్రారంభిస్తాం



పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని చుక్కవానిపాలెం ప్రాంతంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు రంగం సిద్ధమైంది. త్వరలో పనులు ప్రారంభించి శరవేగంగా బ్రిడ్జిని నిర్మించేందుకు కృషి చేస్తాం.

-కె.జయచంద్ర, ఏపీఐఐసీ, ఐలా కమిషనర్

పవన్‌కల్యాణ్‌తోనే యువతకు భరోసా

జనసేన పార్టీ 'గాజువాక' ఇన్‌చార్జి కోన తాతారావు

అగనంపూడి, జనవరి 21: యువతకు భరోసా, రాష్ట్రానికి మంచి భవిష్యత్తు జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తోనే సాధ్యమని ఆ పార్టీ గాజువాక ఇన్‌చార్జి కోన తాతారావు పేర్కొన్నారు. జీవీఎంసీ 85వ వార్డు పరిధి అగనంపూడి పెదమడక శివాలయం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన భారీ బైక్ ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించారు. తొలుత శివాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలంతా అధోగతి పాలయ్యారన్నారు. రాష్ట్రంలో అవినీతి తప్ప అభివృద్ధికి చోటులేకుండా పోయిందని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జనసేన-టీడీపీ కూటమి విజయం తప్పదన్నారు. బైక్ ర్యాలీలో అధిక సంఖ్యలో నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు. కాగా ర్యాలీ 79, 85, 86, 87, 88 వార్డుల్లోని పలు ప్రాంతాల మీదగా సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు దుల్ల రామునాయుడు, బలిరెడ్డి నాగేశ్వరరావు, గవర సోమశేఖర్, కరణం కనకారావు, మేడిశెట్టి విజయ్, డి.త్రినాథ్, వెంకటరమణ, వసంతరావు, తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాలొన్న జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు. (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కోన తాతారావు

శోభాయమానంగా ఆలయాలు ముస్తాబు



పుష్పాలతో అలంకరించిన గ్రీన్‌సిటీలోని శ్రీవారి ఆలయం

కూర్మన్నపాలెం, జనవరి 21: అయోధ్యలో సోమవారం రామ మందిరం ప్రారంభోత్సవం, బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠను మహోత్సవాన్ని ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు పలు ప్రాంతాల్లోని ఆలయాలో శోభాయమానంగా ముస్తాబయ్యాయి. ఇందులో భాగంగా 86వ వార్డు శాతవాహననగర్‌లో అభయాంజనేయస్వామిఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తమలపాకులు, నిమ్మకాయల దండలతో స్వామిని అలంకరించి సింధూర పూజలు జరిపారు. సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసాను మహిళలు పఠించారు. సోమవారం సామూహిక పూజలు, అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. 70 వార్డు ఎల్‌వీ నగర్‌లోని పలు కాలనీల్లో శ్రీరాముని వేషధారునితో రామనామ జపం నిర్వహిస్తూ ర్యాలీ చేపట్టారు. బీజేపీ నాయకుడు దీనంకొండ కృష్ణంరాజు, జనసేన నాయకులు సూరిబాబు, చిరంజీవి, నర్సింగ్, సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రీన్‌సిటీలోని శ్రీవారి ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు మాట్లాడుతూ సోమవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు పురవీధుల్లో కలశాలు, కోలాటాలు, రామభజనలతో శోభాయాత్ర, తదితర కార్యక్రమాలను చేపడతామన్నారు.

ఉక్కుటౌన్‌షిప్: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని స్టీల్‌ప్లాంట్ లోపల గల పురాతన శివాలయంలో ఆదివారం నుంచే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయంలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వద్దనున్న శ్రీరాముల వారి చిత్రపటానికి పాలాభిషేకం చేసి పూజలు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం వరకు పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే స్టీల్ ప్లాంట్ విశ్వకర్మ ఆలయంలో పూజలు చేశారు. ఉదయం నుంచి వికాస తరంగిణి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా, గోవింద నామాలు, విష్ణుసహస్రనామ పారాయణాన్ని పఠించారు.

అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ప్రారంభమైన పూజలు



ఎల్‌వీనగర్‌లో రాముని వేషధారునితో కలిసి శోభాయాత్ర..

రామాలయాలను శుభ్రం చేసిన భక్తులు

అక్కిరెడ్డిపాలెం: అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో ఆదివారం 68, 69 వార్డుల పరిధి అక్కిరెడ్డిపాలెంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాన్ని, హరిజన జగ్గయ్యపాలెంలోని సీతారామ మందిరాన్ని, తుంగ్లాంలోని విజయరాఘవస్వామి, మిందిలోని కోదండరామాలయాన్ని, నాతయ్యపాలెం, షీలానగర్‌ల్లోని రామాలయాలను ఆలయ కమిటీల సభ్యులతో పాటు ఆయా ప్రాంతాల్లోని భక్తులు శుభ్ర పరిచి ముగ్గులు వేశారు. సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



అక్కిరెడ్డిపాలెంలో రామాలయాన్ని శుభ్రపరుస్తున్న భక్తులు



అయోధ్యలో ఆలయ ప్రారంభోత్సవం పురస్కరించుకుని నిర్వహిస్తున్న బైక్ ర్యాలీ



ప్రహ్లాదపురంలో శోభాయాత్రలో శ్రీరామ భక్తులు

వైభవంగా జైశ్రీరామ్ శోభాయాత్ర

అయోధ్యలో రాముని ఆలయ ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని ర్యాలీలు

ఎన్.ఎ.డీ జంక్షన్, జనవరి 21: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, ఆలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ, విశాఖ మహానగర్ సహ నేతృత్వంలో బైక్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ ర్యాలీ ఆర్ఆర్‌వీ పురం నుంచి బాజీజంక్షన్, ఎన్ఏడీ, మర్రిపాలెం మీదుగా కంచరపాలెం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో దాదాపు వంద బైక్‌ల్లో జైశ్రీరామ్ పేరుతో ఉన్న జెండాలతోనినాదాలు చేస్తూ ముందుకుసాగారు. ఈ కార్యక్రమంలోవిశాఖ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ దాడి పురుషోత్త రమేష్, కె.ఆశోక్, చందు, సతీష్, నారాయణరావు, సంతోష్, ఆర్.ఎస్.ఎస్, విశ్వ హిందూపరిషత్ ప్రతినిధులు, శ్రీరామ భక్తులు పాల్గొన్నారు.

ప్రహ్లాదపురంలో...

వేపగుంట: ప్రహ్లాదపురం మోడీ స్ట్రీట్ ఆధ్వర్యంలో అయోధ్యలో రామమందిరం నిర్మాణం పురస్కరించుకొని ఆదివారం సింహాచలం డిపో నుంచి గోశాల జంక్షన్ వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ప్రహ్లాదపురం వద్ద పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ పాల్గొన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం ప్రతి హిందువుకు గర్వకారణమన్నారు. ఈయాత్రలో కోలాటం బృందాల ప్రదర్శన ఆకట్టుకుంది. భక్తులకు పానకం అందజేశారు.మోడీ స్ట్రీట్ అధ్యక్షుడు సూరపురాజు, మామిడి దుర్గాప్రసాద్, వరహాలు, రాజేష్ వివిధ కాలనీ సంఘ సభ్యులు, శ్రీరామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వేపగుంటలో ర్యాలీ..

పెందుర్తి నుంచి వేపగుంట వరకు నాలుగు మినీ టిప్పర్ వాహనాల్లో శ్రీరాముని ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర ముగిసింది. ఈ కార్యక్రమంలో సేనాతివానిపాలెం రామాలయ కమిటీ నిర్వాహకుడు బొబ్బర నరసింహనాయుడు, ఆర్ఎస్ఎస్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పెందుర్తిలో..

పెందుర్తి: పెందుర్తిలో శోభయాత్ర నిర్వహించారు. డీఆర్‌సీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి రమణచిట్టి నేతృత్వంలో రామభక్తులు పాతపెందుర్తి రామాలయం నుంచి చినముషిడివాడ పంచముఖ వీరాంజనేయ స్వామి ఆలయం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. చిడతలు, కోలాట ప్రదర్శనలు, రామకీర్తనలతో శోభయాత్ర సాగింది.వేగి పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తిలో..



పేదలకు సామగ్రి అందజేస్తున్న ఏసీపీ త్రినాథ్, కరణంరెడ్డి నరసింగరావు

'సామాజిక సేవ ఎంతో గొప్పది'

గాజువాక, జనవరి 21: సమాజానికి మేలు జరిగేలా చేపట్టే సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. అమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం గాజువాకలో పేదలకు పలు సామగ్రిని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో పేదలు, దివ్యాంగులు, రైతులకు అన్నివిధాల సేవలందించడం అభినందనీయ మన్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారాన్ని అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు భాస్కర్, ప్రతినిధులు బాటా శ్రీనివాస్, హేమలత, సత్యనారాయణ, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఈ-మర్రిపాలెంలో ఘనంగా సీతారాముల పరస

అగనంపూడి, జనవరి 21: జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఈ-మర్రిపాలెం రామాలయం వద్ద ఆదివారం సీతారాముల పరసను ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాములను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పరసను చేపట్టారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, సాముగారిడీలు, బొమ్మలకొలువు, డ్యాన్స్ బేబీ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీరామునాయుడు, టీడీపీ నాయకుడు దుల్ల చెల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

64వ వార్డులో కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర

పెదగంట్యాడ, జనవరి 21: జీవీఎంసీ 64వ వార్డు పరిధి గంగవరం, పల్లిపాలెం, జాలరిపల్లిపాలెం గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ వారు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపడగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొవిరి కోదండరావు, కొవిరి దేముడు, ఎ.నూకరాజు, కె.అప్పన్న, అంగ పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీసీలను అణచివేస్తున్న వైసీపీకి బుద్ధి చెప్పాలి

» 'పశ్చిమ' ఎమ్మెల్యే గణబాబు



జయహో బీసీ సమావేశంలో మాట్లాడుతున్న ఎ మ్మెల్యే గణబాబు

మల్కాపురం, జనవరి 21: రాష్ట్రంలో బీసీలను అణవేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి సమష్టిగా ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పాలని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పిలుపునిచ్చారు. శ్రీహరిపురం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని చింతచెట్టు వద్ద ఆదివారం టీడీపీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో జయహో బీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీకి వెన్నుముక బీసీలేనని అన్నారు. బీసీల కోసమే ఈ పార్టీ ఆవిర్భవించినట్టు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాతే వారికి గుర్తింపు వచ్చిందనితెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ రాష్ట్రం అన్నిరంగాలలో నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పాలనతో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందగా, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, 63వ వార్డు కార్పొరేటర్ గల్లాచిన్న, మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరీ, వార్డుల అధ్యక్షులు కోరాడ శ్రీను, మజ్జి సోమేష్, మాతా శ్రీను, బీసీ జిల్లా నాయకులు ఉరుకూటి డేవిడ్, జనసేన వీరమహిళ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు రోజులు దగ్గర పడ్డాయి..

అగనంపూడి: వైసీపీ అవినీతి పాలనకు రోజులు సమీపించాయని 85వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కర్రి దశేంద్ర పేర్కొన్నారు. డొకాండలో ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో కక్ష సాధింపు, అవినీతి, దౌర్జన్యం తప్పా అభివృద్ధి జరగలేదని విమర్శించారు. టీడీపీ నాయకులు విందుల రాజు, గొల్లవిల్లి నూకరాజు, కత్తి తిలక్, మంగరాజు, గురుమూర్తి, మేడిశెట్టి వెంకటేశ్ పాల్గొన్నారు.



ఊరేగింపులో దినేశ్ మోదీ, మహిళలు

గాజువాకలో ఆర్‌కే స్టోర్స్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు

జై శ్రీరామ్ అంటూ

నినదించిన స్టోర్స్ అధినేత దినేశ్ మోదీ, భక్తులు

గాజువాక, జనవరి 21: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సోమవారం జరగనున్న నేపథ్యంలో గాజువాక ఆర్‌కే స్టోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో ఆర్‌కే స్టోర్స్ అధినేత దినేశ్ మోదీ పాల్గొన్నారు. ఆయనతో పాటు ఊరేగింపులో పాల్గొన్న భక్తులంతా జై శ్రీరామ్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. సోమవారం అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం, బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రతి ఇంట్లో అందరూ దీపాలు వెలిగించి పండగ మాదిరిగా జరుపుకోవాలని దినేశ్ మోదీ ఆకాంక్షించారు. ఈ ఊరేగింపులో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు. కాగా సోమవారం శ్రీకాకుళం పట్టణంలో భారీ ఊరేగింపు కార్యక్రమాన్ని చేపడతామని నిర్వాహకులు తెలిపారు.

నెల్లిముక్కులో రక్తదాన శిబిరం

పెదగంట్యాడ, జనవరి 21: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు పరిధి దొమ్మేటి వీధిలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని అమ్మ ఫౌండేషన్ సహకారంతో చప్పిడి కుమార్ జ్ఞాపకార్థం ఆయన మిత్రబృందం నిర్వహించారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించగా కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, టీడీపీ నాయకులు పులి వెంకటరమణారెడ్డి, పి.సోమునాయుడు, ఫౌండేషన్ సభ్యులు చప్పిడి తాతారావు, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల శంఖారావాన్ని సక్సెస్ చేయాలి

పెదగంట్యాడ, జనవరి 21: ఈ నెల 27న భీమిలిలో జరగనున్న వైసీపీ ఎన్నికల శంఖారావాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి కోరారు. టీఎన్ఆర్ కల్యాణ మండలంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల శంకారావానికి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, వైసీపీ గాజువాక ఇన్‌చార్జి ఉరుకూటి రామచంద్రరావు, కార్పొరేటర్లు బొడ్డు నరసింహపాత్రుడు, భూపతిరాజు సుజాత, మహ్మద్ ఇమ్రాన్, రాజాన రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మరిడిమాంబ అమ్మవారి పరస

మల్కాపురం, జనవరి 21 : మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పరస మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఏటా జనరివరి 22వ తే దీన కాకి అప్పన్న జ్ఞాపకార్థం ఈ మరిడిమాబ పరస ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. అయితే, 1997లో హెచ్‌పీసీఎల్‌లో జరిగిన విస్ఫోటనంలో 61 మంది మంది మృత్యువాతపడ్డారు. ఆ సమయం లోమల్కాపురంమంటలు వ్యాపిస్తాయని అంతా ఆందోళన చెందారు. అయితే ఇవి మల్కాపురంనకు తాకకుండా మరిడిమాంబే కాపాడారని గ్రామస్థులు నమ్మకం. అప్పటినుంచి ఉత్సవాలు మరింత బాగా చేస్తున్నారు.



అమ్మవారు

సినిమా గైడ్

● **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి),

● **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారేట్ 36, దొండకాయలు 26, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వె ల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 48 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30 , కంద 58, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

ఉత్తరాఖండ్ సీఎంకు శారదాపీఠం ఆహ్వానం

పెందుర్తి, జనవరి 21: ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ దామినితో డెహ్రాడూన్‌లో ని ఆయనఅధికార నివాసంలో ఆదివారం పెందుర్తి శారదాపీఠం ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర సరస్వతి మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగాఫిబ్రవరి 15 నుంచి 19 వరకు జరగనున్న శారదాపీఠం వార్షికోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను పీఠం తరపున సీఎం దామినికిఅందజేశారు.వార్షికోత్సవాలకు ప్రత్యేక ఆహ్వానితులుగాహాజరుకావాలని ఆహ్వానించారు.



సీఎం దామినికి ఆహ్వాన పత్రిక ఇస్తున్న ఉత్తర పీఠాధిపతి స్వాత్మానందేంద్ర

మల్కాపురం పోలీసుస్టేషన్ సీఐగా సన్యాసినాయుడు

మల్కాపురం, జనవరి 21: మల్కాపురం పోలీసు స్టేషన్ సీఐగా సన్యాసినాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా ఉన్న జీడీబాబు ఇటీవల బదిలీపై సాలూరు వెళ్లారు. పద్మనాభంనుంచి సన్యాసినాయుడు మల్కాపురంనకు బదిలీపై వచ్చారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, పోలీసు ఉన్నతాధికారుల సూచనలు, ప్రజల సహకారంతో శాంతిభద్రతలను పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా పలువురు పోలీసు సిబ్బంది, స్థానిక పెద్దలు ఆయనకు స్వాగతం పలికారు.

విండ్‌బాల్ క్రికెట్ పోటీలు

మల్కాపురం, జనవరి 21: భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని పారిశ్రామిక ప్రాంత దళితసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక ఇండస్ట్రియల్ కాలనీలో ఉన్న మైదానంలో దళిత సంఘాల ప్రతినిధులకు ఆదివారం విండ్‌బాల్ క్రికెట్ పోటీలను నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఈ పోటీలను ప్రారంభించారు. విజేతలకు ఈనెల 28న యారాడలో బహుమతులు ప్రదానం చేయనున్నట్టు నిర్వాహకులు అనపర్తి సుదర్శన్, గుడాల ఈశ్వరరావు తెలిపారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఎన్ఎంయూ

వేపగుంట జనవరి 21: ఎన్ఎంయూ జోనల్ కమిటీ పిలుపు మేరకు సింహాచలం డిపోలో కార్మికులు, ఆర్టీసీ ఉద్యోగులు అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎస్‌లు వెంటనే కలపాలని, డే అవుట్, నైట్ అవుట్ అలవెన్స్‌లు ప్రతినెలా చెల్లించాలని, 2019లో జారీచేసిన సర్క్యులర్‌ను అమలు చేయాలని డిపో చీఫ్ ఎడ్వయిజర్ ఎస్.ఎ.రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష కార్యదర్శిలు డి.ఎ.నాయుడు, జె.ఎస్.ఎన్.రాజు, టీ.ఎన్.రావు, బీ.ఎస్.రాజు, జి.శ్రీను పాల్గొన్నారు.



సింహాచలం డిపో వద్ద ఎన్ఎంయూ ధర్నాలో కార్మికులు .

'రాజ్యాంగ లక్ష్యాల సాధనకు సమైక్యత శిబిరాలు దోహదం'

మల్కాపురం, జనవరి 21 : భారత రాజ్యాంగ లక్ష్యాలైన ఐక్యతను, సమగ్రతకు జాతీయ సమైక్యత శిబిరాలు ఎంతగానో దోహదపడినట్టు జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయదేవి పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వారంరోజులపాటు ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మర్రి లక్ష్మణరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో జరిగిన శిబిరంలో ఆంధ్ర రాష్ట్ర కంటింజెంట్ లీడర్‌గా పాల్గొన్నారు. ఆదివారం నగరానికి చేరుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఈ జాతీయ శిబిరంలో 12 రాష్ట్రాల వలంటీర్లు , ప్రోగ్రాం అధికారులు పాల్గొనగా, ఏపీలోని 11 విశ్వవిద్యాలయాల నుంచి ఎంపికైన మహిళ వలంటీర్లకు కంటెంజెంట్ లీడర్‌గా వ్యవహరించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రదర్శించిన సాంస్కృతిక అంశాల భారత విభిన్న సంస్కృతిని ఐక్యత ప్రాధాన్యతను తెలియచెప్పాయన్నారు.

నేటి నుంచి పోలమాంబ పరస ఉత్సవాలు



పోలమాంబ అమ్మవారు

జగదాంబ కూడలి, జనవరి 21: గ్రేటర్ 30వ వార్డు పరిధిలోని కుమ్మరవీధి పోలమాంబ అమ్మవారి పరస మహోత్సవాలకు సర్వసిద్ధమైంది. సోమవారం తొలేళ్లు పురస్కరించుకుని ఉదయం అమ్మవారికి ప సుపు అద్దకంతో ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం మహిళలు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి జలంతో అభిషేకం జరుపుతారు. రాత్రి 7 గంటలకు కమిటీ నివేదిక, పుర ప్రజలకు సత్కారం, పేద మహిళలకు చీరలు పంపి ణీ చేయనున్నట్టు శ్రీ పోలమాంబ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా ఉంటుంది. 23న మంగళవారం పరస ఉత్సవంలో భాగంగా అర్థరాత్రి 12 గంటల తర్వాత అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు జరిపి భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిప్పుల గుండం, సాముగరిడీలు, దాసుళ్ల సందడి,కోలాటాలు, పులివేషాలు తదితర సాంస్కృతిక కార్యక్ర మాలుంటాయి. వాచ్ హౌస్ వద్ద లేరారే జానపద గీతాల ప్రదర్శన ఉంటుందని కమిటీ తెలిపింది. 24 తేదీన అన్న సమారాధన ఉంటుంది. భక్తులకు ఇబ్బం దు లు తలెత్తకుండామహారాణిపేట పోలీసులు ప్రత్యేకంగా బందోబస్తు ఏ ర్పాటు చేస్తున్నారు. ఆలయ కమిటీ వలంటీర్లు సేవలందజేయనున్నారు.

బాలికలకు తోడ్పాటు అందించాలి



జాతీయ బాలికల దినోత్సవ ర్యాలీలో ప్రతినిధులు

బీచ్‌రోడ్డు, జనవరి 21: బాలికలు సమాజంలో సమస్యలు, సవాళ్లను అధిగమించేలా వారికి ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని స్వచ్ఛంద సంస్థ క్రై చైల్డ్ రైట్స్ అండ్ యూ ప్రతినిధులు కోరారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీచ్ రో డ్డులో 'వాక్ టూ ఎంపవర్ హెర్' అనే నినాదంతో అవగాహన ర్యాలీ నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ బాలిక దినోత్సవం ప్రాధాన్యం పురష్కరించుకుని ఈ ర్యాలీ చేపట్టినట్టు చెప్పారు. బాలికలు ఎదుర్కొంటున్న విద్య, రక్షణ, ఆరోగ్యం సవాళ్లపై పౌర సమాజంలో అవగాహన పెంపొందాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో వైజాగ్ చాప్టర్ చర్మన్ హర్షనందన్, సునీల్, జి. సీతామహలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఏయూను జగనన్న యూనివర్సిటీగా మార్చండి

» జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు ఎద్దేవా

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఏయూ పేరును జగనన్న యూనివర్శిటీగా మారుస్తూ ప్రభుత్వం తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని, వీసీ ప్రసాదరెడ్డిని ఉత్తరాంధ్ర స్టార్ క్యాంపెయినర్‌గా నియమించాలని జన జాగరణ సమితి రాష్ట్ర కన్వీనర్ వాసు ఎద్దేవా చేశారు. ఏయూ వీసీగా రెండోసారి ప్రసాదరెడ్డిని నియమించిన నేపథ్యంలో ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైసీపీ క్రియాశీలక రాజకీయాల్లో కీలక వ్యక్తిగా వ్యవహరిస్తున్న ప్రసాదరెడ్డిని రెండోసారి వైస్ చాన్సలర్‌గా నియమించడాన్ని జన జాగరణ సమితి తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఏయూను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉత్తరాంధ్ర పార్టీ కార్యాలయంగా మార్చుకుని భ్రష్టు పట్టించిందన్నారు. వీసీ బాధ్యతల స్వీకరణకు వైసీపీ జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు పాల్గొని ఆహ్వానించడాన్ని చూస్తే.. వర్శిటీ వీసీగా కంటే వైసీపీ వ్యవహారాల ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీక రించిన ట్టుగా ఉందనివిమర్శించారు.ప్రసాదరెడ్డినిరెండోసారి వీసీగా గవర్నర్ నియమించడాన్నివిద్యావంతులు, మేధావులు ముక్తకంఠంతో ఖండిస్తున్నారన్నారు.

పోలీసు క్వార్టర్స్‌ను మరమ్మతు చేపట్టాలి: సీపీ



కరాసలో క్వార్టర్స్ పరిశీలిస్తున్న సీపీ

మర్రిపాలెం, జనవరి 21: విశాఖ పోలీసు కమిషనర్ ఏ రవి శంకర్ ఆదివారం ఎయిర్ పోర్టు పోలీసు స్టేషన్ పరిధి మర్రిపాలెం కరాసలోని పోలీసు క్వార్టర్స్‌ను సందర్శించారు. క్వార్టర్స్‌లోని అన్ని భవనాలను పరిశీలిం చారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను త్వ రతగతిన మరమ్మ తులు చేపట్టాలని ఆదేశించారు. అలాగే, డ్రైనేజీ సమస్యలను పరి ష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. డీసీపీ-2 కె.ఆనందరెడ్డి, ఏసీపీలు ఆర్మడ్ రిజర్వ్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వెయిట్ లిఫ్టింగ్ సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

విశాఖప ట్నం (స్పో ర్ట్సు), జనవరి 21: విశాఖపట్నం జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికలు ఆదివారం జరిగాయి. నగరంలో ఓ హోటల్లో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షునిగా పి.వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్.కేశవ, కోశాధికారిగా ఎస్.గురివినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఆర్‌వీఎల్ఎస్.రత్నాకరరావు, కేవీ రమణ, ఏ రామారావు, సీ పండు శంకర్, సంయుక్త కార్యదర్శులుగా డీ శంకరరావు, వీ శ్రీధర్, ఎస్‌వీ.రమణ, బీ రమేష్‌కుమార్‌తోపాటు ఏడు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. భారత వెయిట్ లిఫ్టింగ్ సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షుడు కంచరాన సూర్యనారాయణ గౌరవ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ ఎన్నిక పర్యవేక్షకుడిగా రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంఘం ప్రతినిధి బడేటి వెంకటరామయ్య, ద ఒలింపిక్ సంఘం ప్రతినిధులు ఎస్.గోపీకృష్ణ, ఆర్.వెంకటరావు, బొజ్జా రామయ్య వ్యవహరించగా, ఎన్నికల అధికారిగా కూన వెంకటరమణ ఉన్నారు.

రైళ్లకు తగ్గని సంక్రాంతి ప్రయాణికుల తాకిడి

» తిరుగు ప్రయాణంలో అవస్థలు » రిజర్వేషన్ కోచ్‌ల్లోనూ రద్దీ



రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

విశాఖపట్నం, జనవరి 21: సంక్రాంతి తిరుగు ప్రయాణికులపై రైళ్ల రద్దు ప్రభావం తీవ్రంగా చూపుతోంది. రైళ్లన్నీ జనాలతో కిక్కిరిసినడుస్తున్నాయి. పండుగ ముగించుకుని గమ్యాలకు చేరేందుకు ఆదివారం స్టేషన్‌కు చేరుకున్న ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్లాట్‌ఫామ్‌లన్నీ జనాలతో కిటకిటలాడాయి. ఏ రైలులో కూడా లోపలికి ప్రవేశించే అవకాశం లేకపోవడంతో ది క్కుతోచని పరిస్థితి ఎదుర్కొన్నారు. పిల్లాపాపలతో స్టేషన్‌కు చేరిన కొందరు రద్దీకి భయపడి ప్రయాణాన్ని వాయిదా వేసుకుని తిరిగి ఇంటి ముఖం పట్టారు. మరికొందరు మరో రైలు కోసం ని రీక్షిస్తూ కనిపించారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు రద్దీని ఎదుర్కొని గమ్యాలకు చేరేందుకు ప్రయత్నించారు. విశాఖనుంచి ఉత్తరాంధ్ర ప్రాంతాలతోపాటు భువనేశ్వర్, రాయగడ, రాయపూర్, కోరాపుట్ ప్రాంతాలకు వెళ్లే రైళ్లతోపాటు రాజమండ్రి, విజయవాడ, సికింద్రాబాద్ పరిసర ప్రాంతాలకు బయలుదేరే అన్ని రైళ్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రిజర్వేషన్ కోచ్‌లు కూడా సాధారణ కోచ్‌లు తలపించే విధంగా కిక్కిరిసి నడవడం గమనార్హం.

రైళ్ల రద్దు ప్రభావం

రైళ్ల రద్దు ప్రభావం... ఆదివారం పండుగ తిరుగు ప్రయాణికులపై స్పష్టంగా కనిపించింది. వాల్తేరు డివిజన్ పరిధిలోని సింగపూర్ రోడ్డు, రాయగడ స్టేషన్ల మధ్య మూడో లైను నాన్ ఇం టర్ లాకింగ్ నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ-రాయపూర్-విశాఖ ప్రత్యేక పాసింజర్ రైళ్లు (08528/08527), విశాఖ-భవానీపట్న- విశాఖ ప్రత్యేక రైళ్లు (08504/08503), విశాఖ-కోరాపుట్-విశాఖ ప్రత్యేక పాసింజర్ రైళ్లు (08546/08545), విశాఖ-కోరాపుట్-విశాఖ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (08512/08511)తోపాటు తిరుపతి- బిలాస్‌పూర్-తిరుపతి ఎక్స్‌ప్రెస్ (174 82/17481) రైళ్లను రద్దు చేయడంతో ఆ ప్రభావం ఉత్తరాంధ్రతోపాటు ఒడిశాలోని తెలుగు ప్రజలు నివసించే ప్రాంతాలపై చూపింది.

ఇక, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ సెక్షన్‌లో భద్రతా నిర్మాణ పనులు జరుగుతున్నందున విశాఖ, గుంటూరు మధ్య నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లతోపాటు (17239/17240), విశాఖ - విజయవాడ/గుంటూరు-విశాఖ మధ్య నడిచే ఉదయ్ ఎక్స్ ప్రెస్ సర్వీసులు (22701/ 22702) రద్దుతో కోస్తాంధ్రలోని తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలతోపాటు కృష్ణా, గుంటూరు జిల్లాకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. ఆదివారం ఉదయం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ (12805)తోపాటు మధ్యాహ్నం బయలుదేరే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ (12717), తిరుమల ఎక్స్‌ప్రెస్ (17488)లకు తీవ్ర రద్దీ నెలకొంది. ఇక, సోమవారం తప్పనిసరిగా విద్య, వ్యాపార, ఉద్యోగాల్లో చే రాల్సిన వారు సికింద్రాబాద్ తదితర ప్రాంతాలకు బయలుదేరడంతో విశాఖ నుంచి వెళ్లే.. గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), దురంతో (22203), గరీబ్‌రథ్(12739), విశాఖ-సికింద్రాబాద్ ఏసీ ఎక్స్‌ప్రెస్ (12783), ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18519) వంటి ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015), సంబల్‌పూర్-నాందేడు (20 809), కో ణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ (12703) రైళ్లు రద్దీగా నడిచాయి. రిజర్వేషన్ బోగీలు జనరల్ కోచ్‌లను తలపించేలా కిటకిటలాడాయి.

నగరంలో వైసీపీ నాయకుల భూ దోపిడీ

» రామానాయుడు స్టూడియో భూముల స్వాహాకు యత్నం
» అందులో భాగంగానే వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు
» టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న పల్లా

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌రోడ్‌లో రామానాయుడు స్టూడియోకు కేటా యించిన 34.44 ఎకరాల భూముల దోపిడీకి అధికార పార్టీ పెద్దలు వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను మార్పు చేశారని టీడీపీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం ఆయన నగరంలోని పార్టీ కార్యాల యంలో విలేక రులతో మాట్లాడారు. విశాఖలో సినీ పరిశ్రమ విస్తరణ కోసం 2003లోఅప్పటి సీఎం చంద్రబాబునాయుడు 34.44 ఎకరాలు రామానాయుడుకు కేటాయించారని గుర్తుచేశారు. అయితే ఇక్కడి విలువైన భూములను బెదిరించి దోచుకున్న వైసీపీలోని కీలకవ్యక్తులు, స్టూడియో ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాల లేఅవుట్‌కు జీవీఎంసీ అనుమతి ఇచ్చిందన్నారు. దీనిపై తమ పార్టీకి చెందిన తూర్పుఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు సుప్రీంకోర్టులో కేసు వేశారని చెప్పారు. స్టూడియోను రిక్రియేషన్ కోసం తప్ప ఇతరత్రా అవసరాలకు వినియోగించరాదని కోర్టు స్టే ఇచ్చి మొట్టికాయలు వేసిందన్నారు. నగరంలో విలువైన భూ ములు దోచుకున్న వైసీపీ నాయ కులు, వారితో పాటు తమ అనుయాయులకు చెందిన భూములకు ప్రయోజనం కలిగేలా వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్‌ను ఇష్టానుసారం మార్చేశారని ఆరోపించారు. గాజువాకలో పాత గాజువాక జంక్షన్ నుంచి టోలుగేటు వరకు మాస్టర్‌ప్లాన్ మార్పులు చేసి రోడ్‌కు అవసరమైన భూసేకరణ లో అస్మదీయులకు టీడీఆర్‌లు జారీకి ప్రయ త్నా లు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. సిరిపురం నుంచి ఆశీలమెట్ వరకు రోడ్ విస్తరణకు అనువు గా మాస్టర్ ప్లాన్ మార్చడంతో సీబీసీఎన్‌సీకి భారీ లబ్ధి చేకూర్చారన్నారు. విశాఖ - భీమిలి బీచ్ రోడ్‌ను ఎస్‌వోఎస్‌విలేజ్ జంక్షన్ నుంచి విజయ సాయిరెడ్డి భూములున్న ప్రాంతం మీదుగా మార్పులు చేశార న్నారు. పెద జాలారి పేటకు వెళ్లే పెద వాల్తేర్ జం క్షన్‌కు అనుకుని భారీ బహుళ అంతస్తు కోసం ప్లాన్ ను మార్పు చేశారని, ఇలా అనేకచోట్ల తమకు అనుకూలంగా మార్పులు చేశారన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక వీఎంఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్ లో అక్రమాలపై విచారణ చేపడతా మన్నారు. అక్రమంగా టీడీఆర్‌లు పొందిన వారిని జైలుకు పంపిస్తా మని హెచ్చరించారు. ఓటర్ల జాబితాలో అక్ర మాలపై అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసు కోకపో వడం దారుణమన్నారు.

తిరుగు ప్రయాణికులకు 73 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, జనవరి 21: సంక్రాంతికి స్వస్థలాలకు వచ్చి తిరుగు ప్రయాణమయ్యే వారికోసం ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం ఆదివారం 73 ప్రత్యేక సర్వీసులను ఆపరేట్ చేసింది. విశాఖ నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడిపింది. హైదరాబాద్‌కు 8, విజయవాడకు 25, రాజమండ్రికి 40 స్పెషల్ సర్వీసులు నడిపింది. ఈ ప్రాంతాలకు సాధారణ షెడ్యూల్స్ ఉన్నా, వాటి సీటింగ్ కెపాసిటీకి మించి ప్రయాణికుల డిమాండ్ ఉండటంతో ఈ ప్రత్యేక సర్వీసులు నడిపింది. మధ్యాహ్నం నుంచి రాత్రి 8.00 గంటల వరకు ఈ బస్సులు నడిపారు. సోమవారం నుంచి సంక్రాంతి తిరుగుప్రయాణికుల డిమాండ్ తగ్గే అవకాశమున్నట్టు ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

జనసేన సభ్యత్వ కార్డులు జారీ



కార్డులందిస్తున్న వార్డు అధ్యక్షుడు అప్పారావు

మురళీనగర్, జనవరి 21; మాధవధార కళింగ నగర్‌లో ఆదివారం జనసేన పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా 51వ వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు జి.అప్పారావు మాట్లాడుతూ, పార్టీ అధికారికంగా జారీ చేసిన సభ్యుని ఫొటో , వివరాలతో కూడిన ఐడెంటిటీ కార్డుని పోలింగ్ బూత్‌ల వారీగా అందించామన్నారు.ఈ సభ్యులంతా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. ఓటర్లను చైతన్యం చేసే దిశగా ముందుకి సాగాలన్నారు. వైసీపీ పాలనలోని అరాచకాలను వివరించాలని సూచించారు. కార్యకర్తలు, పార్టీ అభిమానులు ఉన్నారు.

భారత రాజ్యాంగం ఎంతో విశిష్టమైంది

» వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు కె. రమాప్రభ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్, జనవరి 21: భారత రాజ్యాంగం ఎంతో విశిష్టమైనదని వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ వ్యవస్థాపకులు డా.కె.రమాప్రభ అన్నారు. ఆదివారం వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు 'ప్రతి హృదయంలో రాజ్యాంగం' అనే నినాదంతో బాలలతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలంతా కుల, మత, భాషా, లింగ, ప్రాంత, జాతి తారతమ్యంలేకుండా అందరూ సమానమేనని రాజ్యాంగంలో పేర్కొన్నట్టు చెప్పారు. రాజ్యాంగ రూపకర్త డా.బి.ఆర్.అంబేడ్కర్ బాల్యంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారన్నారు. అన్నిటినీ ఎదిరించి అణగారిన వర్గాలను విముక్తికి పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో భాగవతుల చారిటబుల్ ట్రస్ట్ కో ఆర్డినేటర్ వేణు, మోదాంబిక, ఎస్. హరిత, జాహ్నవి, అలేఖ్య, కొండమ్మ, అప్పారావు, కృష్ణారావు, స్వర్ణలత, అప్పలకొండ, గుణశంకర్, సరోజినిదేవిపాల్గొన్నారు.

కమ్యూనిస్టు పార్టీల్లో బలమైన ఐక్యత అవసరం

» సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు 'చలసాని'



లెనిన్‌పై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్, జనవరి 21: దేశంలోని కమ్యూనిస్టు పార్టీల్లో బలమైన ఐక్యతను తీసుకురావాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని రాఘవేంద్రరావు అభిప్రాయపడ్డారు. ఆదివారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాలాంధ్ర బుక్ హౌస్, ప్రజాశక్తి బుక్ హౌస్ ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి సభ మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. రాఘవేంద్రరావు మాట్లాడుతూ, దేశంలోని కమ్యూనిస్టు పార్టీలు రానున్న కాలంలో ప్రధాన పాత్ర పోషించాల్సిన అవసరముందన్నారు. 17 ఏళ్ల వయస్సులోనే జార్ చక్రవర్తి నిర్బంధాన్ని లెనిన్ ఎదుర్కొన్నారని తెలిపారు. మానవాళి కోసం రూపొందించిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఆచరణలోకి తీసుకువచ్చారన్నారు. మాజీ ఎమ్మెల్సీ శర్మ మాట్లాడుతూ, ప్రపంచంలో దోపిడీ రాజ్యాలను కూల్చి కార్మిక రాజ్యాలను స్థాపించాల్సిన అవసరం ఉందన్నారు.కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, ఎం.జగ్గునాయుడు, సీఎస్ క్షేత్రపాల్ ఉన్నారు.

ప్రజల మదిలో లెనిన్ సుస్థిరస్థానం

మాధవధార; రష్యాలో జరిగిన విప్లవంలో లెనిన్ ప్రముఖ పాత్ర వహించి ప్రపంచానికి ఆదర్శ ప్రాయులయ్యారని అమరావతి విశ్వసాహితి సమితి మాధవధార బృందానికి చెందిన కవి చిన్న చూర్యనారాయణ అన్నారు. మాధవధార భరద్వాజ కళాక్షేత్రంలో ఆదివారం లెనిన్ శత వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా పలువురు లెనిన్ చిత్ర పటానికి నివాళులర్పించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత విశేషాల పుస్తకాలను సభలో హాజరైన వారికి అందించారు.



'అయోధ్యలో రామాలయ నిర్మాణం జాతికే గర్వకారణం'



మాధవధారలో ప్రచారం చేస్తున్న సభ్యులు

మాధవధార, జనవరి 21 ; మాధవధారలో మానవ సేవే మాధవసేవ అసోసియేషన్ సభ్యులు ఆదివారం మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో జై శ్రీరామ్ నినాదాలతో అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవంపై ప్రచారం నిర్వహించారు. కాలనీల్లో ఇంటింటికీ శ్రీరామ అక్షతలు అందించారు. రామ మందిరం ఆరంభం రోజైన సోమవారం ఇళ్లల్లో పాటించాల్సిన నియమాలతో కరపత్రాలను అందించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.భానుప్రకాష్ అధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు శ్రీ ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షులు డి.వరప్రసాద్, సెక్రటరీ ఎస్.సీతారామకృష్ణ, సభ్యులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు రామలింగేశ్వరాలయంలో దీపారాధన

అక్కయ్యపాలెం: అయోధ్యలో రామ్ లల్లా విగ్రహప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం పురస్కరించుకుని సోమవారం సాయంత్రం రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయం వద్ద దీపారాధన జరుగనున్నట్లు 26వ వార్డు బీజేపీ అధ్యక్షుడు కే వీ కుమార్ తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో..

మాధవధార: అయోధ్య శ్రీ రాముడి ఆలయ ప్రాణ ప్రతిష్ఠ జరగనున్ననేపథ్యంలో ఈనెల 22న సోమవారం సింహాచల దేవస్థానం ఉప ఆలయమైన మాధవధార పుణ్యక్షేత్రంలోని వేణుగోపాల స్వామి ఆలయంలో విశేష హారతి చేపట్టనున్నట్టు అర్చకులు రాధాకృష్ణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీరామ నామం, పారాయణం ఉంటాయన్నారు.



గీతాభవన్‌లో పూజలు చేస్తున్న ప్రచార సమితి సభ్యులు

గీతా ప్రచార సమితి శ్రీరాముని సంకీర్తనలు

పూర్ణామార్కెట్: వన్‌టౌన్ గీతాభవన్‌లో ఆదివారం గీతా ప్రచార సమితి సభ్యులు సామూహిక శ్రీ రామ సంకీర్తనలు, హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామరక్ష స్తోత్రం తదితర ప్ర త్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించినట్టు సమితి ప్రతినిధులు సీహెచ్ విశ్వేశ్వర రావు తెలిపారు. అయోధ్యలో శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠ అజేయంగా జరగాలని ఆకాంక్షిస్తూ పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త రాజశేఖర్, ఎం.వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

7వరకు న్యాయవాదుల విధుల బహిష్కరణ

విశాఖపట్నం, జనవరి 21: భూ హక్కు-23 చట్టం రద్దుచేయాలని కోరుతూ, రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు చేపడుతున్న విధుల బహిష్కరణ నిరసనను ఫిబ్రవరి 7వతేదీన కొనసాగించనున్నారు. ఉత్తరాంధ్ర న్యాయవాదుల విధుల బహిష్కరణ స్టీరింగ్ కమిటీ , న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఆదివారం సమావేశమై ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. నెలరోజులుగా నిరసన తెలుపుతున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ చట్టం వల్ల ప్రజలకు ఆస్తి హక్కు కోల్పోతారని ఆందోళన వ్యక్తంచేశారు. కేం ద్రం ఒత్తిడి మేరకు ఈస్థితిలో ఫి బ్రవరి 7 తర్వాత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్టు ప్రకటించారు. అలాగే, దీనిపై హై కోర్టును ఆశ్రయించాలని తీర్మానించారు.

డ్వాక్రా సంఘాలకు వైసీపీ వల!

... 5వ పేజీ తరువాయి

దిగారని చెబుతున్నారు.

సహకరిస్తున్న యంత్రాంగం

ఇప్పటికే సీఎం జగన్‌తోపాటు నియోజకవర్గ నేతలు నిర్వహించే సభలు, సమావేశాలకు డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలను పెద్దఎత్తున తరలిస్తున్నారు. ఇందుకు అధికారులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారు. ఆయా సభలకు మహిళలను తరలించడంలో కీలకపాత్ర పోషించిన అధికారులపై నియోజకవర్గ ఇన్‌చార్జిలు దృష్టిసారించారు. ఏళ్ల తరబడి మెప్మాలో పనిచేస్తున్న కొందరు అధికారులకు వందలాది సంఘాలు, ఆర్పీలపై పట్టుంది. వీరికి పెద్ద మొత్తంలో మేలు చేయడం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో మెజారిటీ మహిళలను తమ వైపు తిప్పుకుని, వారి ఓట్లను కొల్లగొట్టవచ్చని వైసీపీ నేతలు భావిస్తున్నారు.

సభ్యులకు తాయిలాల ఎర..

స్వయం సహాయక సంఘాల్లో పనిచేసే అధికారుల నుంచి సభ్యుల వరకు ప్రతి ఒక్కరికీ ఎన్నికల ముందు పెద్దఎత్తున తాయిలాలు పంపిణీ చేస్తే భారీగా ఓట్లు పడతాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు. ఎన్నికల వరకు వేచి ఉంటే అంతగా ఫలితం ఉండదని, ముందుగానే తమవైపు తిప్పుకోవాలని చూస్తున్నారు. ఈ క్రమంలో వివరాల సేకరణను వేగవంతం చేస్తున్నారు. వైసీపీ నేతలు అందించే తాయిలాలు సభ్యులు, ఇతర అధికారులు తీసుకుంటారా అనేది చూడాల్సి ఉంది. అయితే అధికార పార్టీ నాయకులకు అధికారుల సహకారం లభిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరహా చర్యలపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

క్లాప్ వాహనాల ఇష్టారాజ్యం!

... 5వ పేజీ తరువాయి

సచివాలయ సిబ్బంది క్లాప్ వాహనాలను పట్టించుకోవడం మానేశారు. జీవీఎంసీ కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినపుడు క్లాప్ వాహనాలు కనిపించినా, లోతుగా ఆరా తీసిన సందర్భం లేదు. ఇతర అధికారులు కూడా పట్టించుకోవడం మానేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్, వాహనాల డ్రైవర్లను అడిగేవారు లేకుండాపోయారు. తమకు నచ్చినట్టు ఒకటి, రెండు ట్రిప్పులు చెత్త సేకరించి చేతులు దులుపుకుంటున్నారు. అంతేకాదు ఒక్కో ట్రిప్పులో కనీసం 700 కిలోల చెత్త తరలించాలనే నిబంధన ఉన్నప్పటికీ 250-300 కిలోలతోనే ఎంఎస్ఎఫ్‌లకు వాహనాలు వెళ్తున్నాయి.

ముడసర్లోవ ఎంఎస్ఎఫ్‌యార్డులోని తూకంయంత్రం వద్ద పనిచేసే సిబ్బంది వద్ద రికార్డులను పరిశీలిస్తే జోన్-2 పరిధిలో తిరుగుతున్న వాహనాల్లో ఒకటి, రెండు మినహా మిగిలినవేవీ మూడు ట్రిప్పులు తిరిగినట్టు లేదు. నగరంలోని మిగిలిన అన్ని యార్డుల వద్ద పరిస్థితి ఇలాగే ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోకుండా బిల్లులు చెల్లించడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

నగరవాసులకు తిప్పలు

ఇంటింటికీ చెత్త సేకరణ సరిగా జరగకపోవడం, వాహనాలు వచ్చివెళ్లిన సమాచారం కూడా లేకపోవడంతో ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేస్తున్నారు. దీంతో రహదారుల పక్కన చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. రోజుల తరబడి వీటిని అలాగే వదిలేస్తుండడంతో దుర్గంధంతో పాటు పారిశుధ్య సమస్య ఎదురవుతోంది. పశువులు, కుక్కలు వాటిని చిందరవందర చేస్తుండడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అదే సమయంలో చెత్త సేకరణ సక్రమంగా చేయనప్పటికీ కాంట్రాక్టర్‌కు మాత్రం జీవీఎంసీ ప్రతినెల ఠంచనుగా బిల్లులు చెల్లిస్తోంది. దీనివల్ల నెలనెలా రూ.కోట్లు ప్రజాధనం ఖర్చు అయిపోతున్నా... లక్ష్యం నెరవేరడం లేదు. పైగా గతంతో పోల్చితే నగరంలో పారిశుధ్యం పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. ఇటీవల కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు సమ్మెకు దిగారు. ఆ సమయంలో క్లాప్ వాహనాలను కూడా అడ్డుకోవడంతో నగరంలో చెత్తసేకరణ పూర్తిగా నిలిచిపోయింది. దాదాపు 15 రోజుల తర్వాత సమ్మె విరమించారు. కార్మికులు విధులకు హాజరవుతున్నప్పటికీ, క్లాప్ వాహనాలు వీధుల్లోకి రావడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో రోజుకు కనీసం ఒకటి, రెండు ట్రిప్పులైనా తిరిగేవని, ఇప్పుడు రెండు, మూడు రోజులకు ఒకసారి వస్తున్నాయని నిట్టూరుస్తున్నారు. దీనిపై అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ కాంట్రాక్టర్‌పై చర్యలకు వెనుకాడుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సిలబస్ పూర్తికాకుండానే ఫార్మేటివ్ పరీక్షలా?

... 5వ పేజీ తరువాయి

నిర్వహించారు. పలు కారణాలతో వారం రోజుల్లో ముగియాల్సిన ఈ పరీక్షలు రెండు వారాలకుపైగా సాగాయి. తరువాత తరగతుల నిర్వహణకు అనేక ఇబ్బందులు ఎదురయ్యాయి. తుఫాన్ కారణంగా సెలవులు, క్రిస్మస్, సంక్రాంతి సెలవులు, మధ్యలో ఆడుదాం ఆంధ్రాపేరుతో ఉన్నత పాఠశాలల్లో హడావిడి చేశారు. ఉన్నత పాఠశాలల మైదానాల్లో పోటీల నిర్వహణ, విద్యార్థులపై ఒత్తిడి తెచ్చి ఆటలాడించడం జరిగాయి. పైగా ఈ పోటీలు వచ్చేనెల వరకు కొనసాగనున్నాయి. దీంతో విద్యార్థులు ఆటలపై ఫోకస్ పెట్టారు. మొత్తంగా ఫార్మేటివ్-3కు సంబంధించిన సిలబస్ ఇంకా పూర్తికాలేదని ఉపాధ్యాయులే అంగీకరిస్తున్నారు. ప్రాథమిక పాఠశాలల వరకు పెద్దగా ఇబ్బందిలేకపోయినా ఉన్నత పాఠశాలల విద్యార్థులు ఈ పరీక్షలకు సన్నద్ధం కాలేదు. ఇక ప్రైవేటు పాఠశాలల విషయానికి వస్తే విద్యా సంవత్సరం మొదలైన మూడు నెలల్లోనే మొత్తం సిలబస్ బోధించేస్తారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో షెడ్యూల్ మేరకు బోధన సాగుతుంది. దీంతో ఫార్మేటివ్3 పరీక్షలు ఎలా రాస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యపై దృష్టిసారించకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించడాన్ని తల్లిదండ్రులు తప్పుబడుతున్నారు.

ఎక్స్‌లెన్స్!

... 5వ పేజీ తరువాయి

అధికారుల బృందం తనిఖీలు నిర్వహించి, అనుమతి ఇవ్వనుంది. వచ్చే ఏడాది నుంచి కోర్సుల్లో అడ్మిషన్లు చేపట్టే అవకాశం దీనికి అనుసంధానంగా చైల్డ్ సైకియాట్రీ, జీరియాట్రిక్ సైకియాట్రీ (వృద్ధుల మానసిక సమస్యలకు సంబంధించినది), డీ అడిక్షన్ బ్లాక్, మనో వికాస కేంద్రం, అకడమిక్ బ్లాక్‌ను ఏర్పాటు చేయనున్నారు.

భారీగా పోస్టులు..

ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు ట్యూటర్స్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆఫీస్ సెక్షన్ నిర్వహించేందుకు వివిధ కేడర్లకు సంబంధించి 120 ఖాళీలు భర్తీ చేయనున్నారు. ఇప్పటికే పరికరాలను కొనుగోలు చేశారు. రెండు ఈఈజీ మెషీన్లు (బ్రెయిన్ గ్రాఫ్‌ను తెలియజేసేది), నాలుగు ఈసీటీ మెషీన్లు (షాక్ ట్రీట్‌మెంట్‌కు వినియోగించేవి), 12 హై లెవెల్ కంప్యూటర్స్ వచ్చాయి.

'గాడి తప్పిన విద్యా వ్యవస్థ'పై 25న చర్చాగోష్ఠి

విశాఖపట్నం, జనవరి 21: నగరంలోని పౌర గ్రంథాలయంలో ఈనెల 25న గాడి తప్పిన విద్యా వ్యవస్థ అన్న అంశంపై చర్చా గోష్ఠి నిర్వహించనున్నట్టు జన చైతన్య వేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యూపీఎస్సీ పూర్వ ఇన్‌చార్జి చైర్మన్ ఆచార్య చలం, ప్రముఖ రాజనీతి ప్రొఫెసర్, ఏయూ పూర్వ రెక్టార్ ప్రసన్నకుమార్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ పూర్వపు వైస్ చాన్సలర్ ఆచార్య కె. నిరూపరాణి, గీతం వర్సిటీ పూర్వ ప్రొ వైస్ చాన్సలర్ డి. హరినారాయణ, తదితరులు చర్చలో పాల్గొంటారని చెప్పారు.

ఉడా కాలనీలో ఆత్మీయ సమావేశం



మాట్లాడుతున్న బీజేపీ రా ష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, జనవరి 21 ; ఉత్తర నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.విష్ణుకుమార్ రాజు ఆదివారం ఉడాకాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ ప్రగతి, రాజకీయ పరిణామాలు, తదితర సమస్యలపై చర్చించారు. కాలనీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు అశోకచక్రవర్తి, రాధాకృష్ణ, 51వవార్డు టీడీపీ అధ్యక్షులు టి.శ్రీనివాసరావు, బిల్డర్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

25న పాఠశాలల్లో ఓటర్ల దినోత్సవం

భీమునిపట్నం (రూరల్), జనవరి 21 : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 25న ఓటర్ల దినోత్సవం నిర్వహించాలని విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థులకు ఓటుహక్కు ఆవశ్యకతను తెలియజేయడంతో పాటు ఓటుహక్కు వినియోగించుకునే విధానాలను వివరించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ఉదయం 11 గంటలకు విద్యార్థులతో సమావేశం నిర్వహించి, ప్రతిజ్ఞ కూడా చేయించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఆలయ పరిసరాలు పరిశుభ్రత



సింహాచలం, జనవరి 21 : సింహగిరిపై ఉన్న పలు ఆలయాల్లో అధికారులు స్వచ్ఛ తీర్థ సేవ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.ఆదివారం క్షేత్రపాలకుడు బాలత్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి దేవాలయంలో ఈఓ శ్రీనివాస మూర్తి సారథ్యంలోనూ, కొండదిగువ తొలిపావంచా వద్ద పాలక మండలి సభ్యుడు శ్రీనుబాబు ఆధ్వర్యంలో సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు.ప్రధానంగా శివాలయంలో పెద్ద ఎత్తున పెరిగిన మట్టిని, తొలిపావంచా వద్ద భక్తులు కొబ్బరి కాయలు కొట్టడంతో ఏర్పడిన వాటిని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భ్రమరాంబ, నరసింగరావు, పర్యవేక్షణాధికారులు పిళ్లా శ్రీనివాసరావు, లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

భీమునిపట్నం, జనవరి 21 : బీచ్‌రోడ్‌లో వున్న జీఎస్ఆర్ భవనంలో ఈనెల 23న సుభాష్ చంద్రబోస్ జయంతి పురస్కరించుకుని విద్యార్థులకు ఆదివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆదర్శ హిందీ ప్రేమి మండలి ఆధ్వర్యంలో చంద్రబోస్ జీవిత చరిత్రపై తెలుగు, హిందీ మాధ్యమాల్లో ఈ పోటీలు జరిపారు. అలాగే స్వాతంత్ర్య పోరాటంలో అతివాదుల పాత్ర అన్న అంశంపై వక్తృత్వ పోటీలు కూడా నిర్వహించారు. విజేతలకు చంద్రబోస్ జయంతి రోజున బహుమతులు అందిస్తామని సంస్థ గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు తెలిపారు.

బీమా సొమ్ము అందజేత



బాధితురాలికి నగదు అందిస్తున్న కార్పొరేటర్ ఏడుకొండలరావు

భీమునిపట్నం, జనవరి 21 : జీవీఎంసీ 4వ వార్డు గొల్లల తిమ్మాపురంలో ఎల్సి అప్పయ్యమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ. 10 వేల తక్షణ సాయాన్ని కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేరుగు చిన్నారావు,కొయ్య అప్పలనాయుడు, బుద్దల అప్పలనాయుడు పాల్గొన్నారు.

'జాక్సా' విజయవంతం పట్ల ర్యాలీ

భీమునిపట్నం/ఆనందపురం, జనవరి 21 : జపాన్ అంతరిక్ష పరిశోధనా సంస్థ జాక్సా చంద్రుడి ఉపరితలంపై లూనార్ ల్యాండర్ విజయవంతమైందని భీమిలి కేజీబీవీ ప్రిన్సిపాల్ గంగా కుమారి తెలిపారు. ఈమేరకు ఆదివారం విద్యాలయం బాలికలు లూనార్ ల్యాండర్ చిత్రపటాలతో అభినందనలు తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో కరీషా బేగం, తదితరులు పాల్గొన్నారు. ఆనందపురం కేజీబీవీ బాలికలు కూడా ర్యాలీ చేశారు.

పక్కాగా కుల గణన సర్వే

పద్మనాభం (రూరల్), జనవరి 21 : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేను అధికారులు పక్కాగా చేపట్టాలని తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ ఆదేశించారు. ఆదివారం ఆయన పలు గ్రామాల్లో కుల గణన సర్వేను పరిశీలించారు.

సినిమా గైడ్

● **నా సామిరంగ :** రమాదేవి, కిన్నెర, శ్రీకన్య, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), కన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సప్తగిరి (తగరపువలస), నటరాజ్ (పెందుర్తి),

● **సైంధవ్ :** సంగం, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), సీతారామయ్య (పరవాడ), తాతా (తగరపువలస)

● **హనుమాన్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, శారద, గోకుల్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), మినీమోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)

● **గుంటూరు కారం :** జగదాంబ, మెలోడీ, శరత్, శ్రీవెంకటేశ్వర, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, శ్రీనరసింహ (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్, శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), గణేష్ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25,టమాటా 20, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 16, బెండకాయలు 40, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజ్ 18, క్యారేట్ 36, దొండకాయలు 26, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 110, బరబటి 22, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 70, గోరుచిక్కుడు 44, దోస కాయలు 34, వెల్లుల్లి (పెద్దవి) 240, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 48 , ఆగాకర 84, పొటల్స్ 62, కీరదోస 24, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 26, చేమదుంపలు 48, చిలగడదుంపలు 30 , కంద 58, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 28, మామిడి అల్లం 60, బొప్పాయి 32, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	95
ఫారం ధర	--	115
విత్ స్కిన్	--	200
స్కిన్‌లెస్	--	210

తీరానికి పర్యాటకుల తాకిడి



సందర్శకులతో కిటకిటలాడుతున్న రుషికొండ బీచ్

సాగర్‌నగర్/ఎండాడ, జనవరి 21 : రుషికొండ, సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్కు తీర ప్రాంతాలు పర్యాటకులతో ఆదివారం కిటకిటలాడాయి. ఐదు రోజులు సెలవులు కావడంతో నగరంలోని నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి సందర్శకులు అధికంగా తరలివచ్చారు. ముఖ్యంగా హైదరాబాద్, పశ్చిమబెంగాళ్, ఒడిశా నుంచి వచ్చిన వారు తీర ప్రాంతాల్లో గెస్ట్ హౌస్‌లు, రిసార్ట్‌లు తీసుకుని వీకెండ్‌ను ఎంజాయ్ చేశారు. పలువురు రుషికొండ బీచ్‌లో బోటు షికార్ చేస్తూ.. ఇసుక తెన్నెలపై ఆటలు ఆడుతూ సందడిగా గడిపారు. సాగర్‌నగర్, జోడుగుళ్లపాలెం, తెన్నేటిపార్కు తీర ప్రాంతాలు కూడా సందర్శకులతో రద్దీగా కనిపించాయి.

నేడు, రేపు తాగునీటి సరఫరా బంద్

భీమునిపట్నం, జనవరి 21 : పట్టణంలోని పలు ప్రాంతాలకు సోమ, మంగళవారం కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా నిలుపుదల చేయనున్నట్టు జోనల్ కమిషనరు బొడ్డేపల్లి రాము తెలిపారు.ఈమేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భీమిలిలోని 450 కెఎల్, 800 కెఎల్ రిజర్వాయర్లకు నీరు పంపింగ్ చేసే జీఆర్‌పీ పైపులైన్ల స్థానంలో కొండపేట పంప్‌హౌస్ నుంచి గణేష్ థియేటరు వరకూ 350 ఎంఎండీఐ పైపులైన్లు వేశారు. కొండపేట పంప్‌హౌస్ వద్ద 350 ఎంఎం డిఐ ఇంటర్ కనెక్షన్ పైపులైన్ల పనులు జరుగుతున్నాయి. ఈకారణంగా భీమిలి ప్రాంతంలో వున్న రిజర్వాయర్లకు నీటి పంపింగ్ జరగదు. దీంతో సోమ, మంగళవారం కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిపివేయనున్నారు. ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని జడ్సీ తెలిపారు. ట్యాంకర్ల కోసం 6300389896, 9866046100 ఫోన్ నంబర్లను సంప్రతించాలని కోరారు.

గాజువాకలో ఆర్‌కే స్టోర్స్ ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు

జై శ్రీరామ్ అంటూ నినదించిన స్టోర్స్ అధినేత దినేశ్ మోదీ, భక్తులు

గాజువాక, జనవరి 21 : అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సోమవారం జరగనున్న నేపథ్యంలో గాజువాకలో ఆర్‌కే స్టోర్స్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో ఆర్‌కే స్టోర్స్ అధినేత దినేశ్ మోదీ పాల్గొన్నారు. ఆయనతో పాటు ఊరేగింపులో పా ల్గొన్న భక్తులంతా జై శ్రీరామ్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. సోమవారం అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం, బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని ప్రతి ఇంట్లో అందరూ దీపాలు వెలిగించి పండగ మాదిరిగా జరుపుకోవాలని దినేశ్ మోదీ ఆకాంక్షించారు.ఊరేగింపులో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు. కాగా సోమవారం శ్రీకాకుళం పట్టణంలో భారీ ఊరేగింపు కార్యక్రమాన్ని చేపడతామని నిర్వాహకులు తెలిపారు.



ఊరేగింపులో పాల్గొన్న దినేశ్ మోదీ

ఘనంగా సీతారాముల కల్యాణం

ఎంవీపీ కాలనీ, జనవరి 21 : అయోధ్యలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఈనెల 13 నుంచి ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఉదయం చార్టింగ్ విద్యార్థుల డ్రాయింగ్, భక్తి శ్లోకాలు, విజయ్ వాహరి కర్ణాటక గాత్ర సంగీతం, వీరభద్రమ్మ బృందం రామభక్తి గీతాలు, ట్వింకిల్ స్కూల్ చిన్నారుల రామ శ్లోకాలు, చాలీసా నిర్వహించారు. అలాగే వైదిక విజ్ఞాన విపంచి బృందం హనుమాన్ చాలీసా, శ్రీరామ భక్తి గీతాలాపన చేశారు. టీటీడీ ఆధ్వర్యంలోని ధర్మ ప్రచార పరిషత్, విశాఖ జిల్లా ధార్మిక సలహా మండలి, విశాఖ సాగర కార్తీక దీపోత్సవ కమిటీ,వైదిక విజ్ఞాన విపంచి సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి.

నేడు సీతారాముల శాంతి కల్యాణం

సింహాచలం : అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని సింహగిరిపై ఉన్న సీతారామస్వామి ఆలయంలో సోమవారం సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. ఈమేరకు ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 11 గంటలకు శాంతి కల్యాణం, అనంతరం



ప్రత్యేక అలంకరణలో శ్రీఆంజనేయ సీతారామ లక్ష్మణ స్వామి వార్ల విగ్రహాలు

పూర్ణాహుతి జరుగుతుందన్నారు.ఉదయం నుంచి శ్రీరామనామ సంకీర్తనం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పీఎంపాలెం రామాలయంలో...

కొమ్మాది : పీఎంపాలెం రామాలయంలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతా రామమయం పేరిట పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు యాక్టింగ్ ఫిజికల్ సృజన నాట్య మండలి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. విశ్వనాథ రాజేశ్వరరావు, చీమలపాటి రమణమూర్తి ఆధ్వర్యంలో సుందరకాండ, రామతత్వం హనుమాన్ చాలీసా తదితర వాటిపై ప్రవచనాలు ఉంటాయని చెప్పారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఎంవీపీ కాలనీ, జనవరి 21 : పెదగదిలిలో 12వ వార్డు టీడీపీ నాయకులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ సేవా సమితి ట్రస్టు, ఎంవీవీఎస్ మూర్తి ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జిమ్‌సర్ ఆసుపత్రి, గీతం దంత వైద్య కళాశాల వైద్యులు సేవలందించారు. 681 మంది రోగులు వైద్య సేవలు పొందారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నిర్వహించిన ఈ శిబిరంలో దంత పరీక్షలు, రక్తపోటు, నేత్ర పరీక్షలతో పాటు ఈసీజీ వంటివి నిర్వహించారు. శిబిరంలో ఇచ్చిన కార్డుతో గీతం వైద్య శాలలో అన్ని రకాల వైద్య సేవలు, పరీక్షలు ఉచితంగా పొందవచ్చని నిర్వాహకులు ప్రకటించారు. అంతేకాకుండా అవసరమైన మందులు కూడా ఉచితంగా అందచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మాజీ కార్పొరేటరు ఒమ్మి సన్యాసిరావు, 12 వార్డు ఇన్‌ఛార్జి ఒమ్మి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడలో రామ జెండాలు పంపిణీ

భీమునిపట్నం (రూరల్), జనవరి 21 : మండలంలోని చిప్పాడ పంచాయతీ పరిధిలో ఉన్న ఏడు గ్రామాల్లోనూ ఆదివారం ఇంటింటికి రామ జెండాలు పంపిణీ చేశారు. సుత్తమ్మతల్లి భవానీ సేవా పీఠం ఆధ్వర్యంలో 1500 ఇళ్లకు వీటిని అందించారు. ముందుగా దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపి, అనంతరం ఇంటింటికి జెండాలు కట్టడంతో పాటు అక్షింతలను పంపిణీ చేశారు.

'విగ్రహాన్ని కూల్చివేస్తామనడం సరికాదు'

కొమ్మాది, జనవరి 21 : తాము అధికారంలోకి వచ్చిన తరువాత విజయవాడలో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని కూల్చివేస్తామని మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అనడం దుర్మార్గమని మధురవాడ దళితసంఘాల నాయకులు అన్నారు. ఆదివారం వారు నరేంద్ర వ్యాఖ్యలను నిరసిస్తూ బక్కన్నపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైసీపీ భీమిలి నియోజకవర్గం ఎస్సీ సెల్ ఇన్‌చార్జి సియాద్రి కనకరాజు మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నట్టు విగ్రహ నిర్మాణంలో అవినీతి జరిగి ఉంటే నిగ్గు తేల్చడానికి అనేక మార్గాలు ఉన్నాయని, అలాకాకుండా విగ్రహాన్ని కూల్చి వేస్తామనడం సరికాదని పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో దళిత నాయకులు కుడితి రామారావు, నూకవరపు బాబ్జి, గుంటబోయిన సంజీవ్, జామి శివ పాల్గొన్నారు.

నేడు శ్రీరామ శోభాయాత్ర

భీమునిపట్నం, జనవరి 21 : పట్టణంలో సోమవారం శ్రీరామ శోభాయాత్ర జరగనుంది. ఉదయం 8 గంటలకు పాతబస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుంది. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్, శ్రీరామ భక్తులు కోరారు.

ఇంటింటా జైశ్రీరామ్ నామం

పద్మనాభం, జనవరి 21 : మండలంలోని శేరిఖండం గ్రామంలో ప్రతి ఇంటి గోడపై రామ భక్తులు జై శ్రీరామ్ నామాన్ని రాసారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి జైశ్రీరామ్ నినాదాలు చెబుతూ సోమవారం అయిదు దీపాలు వెలిగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాడపల్లి సీతారాం, శేషు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ మైదానంలో స్వచ్ఛభారత్

మద్దిపాలెం, జనవరి 21 : ఏయూ ఇంజినీరింగ్ మైదానంలో ఆదివారం బీజేపీ నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మైదానంలో ఉన్న చెత్తను గోనె సంచుల్లో ఎత్తి ఆటోల ద్వారా తరలించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవీంద్ర రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరంగం ధనేశ్వరరావు, నాయకులు భారతి, పావని, లీలావతి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఏయూకు రూ.1.30 కోట్ల విలువైన ప్రయోగశాల పరికరాలు

వెంకోజీపాలెం, జనవరి 21 : ఏయూకి రూ.1.30 కోట్లు విలువైన ప్రయోగశాల ఉపకరణాలను వయాట్రిస్ ఫార్మసీ సంస్థ తరఫున అందిస్తున్నట్టు ఆ సంస్థ క్వాలిటీ ఇన్వెస్టిగేషన్స్-రెగ్యులేటర్ కమ్యూనికేషన్ విభాగాధిపతి డాక్టర్ దేవ పురాణం తెలిపారు. ఆదివారం ఆయన ఏయూలో వీసీ ఆచార్య ప్రసాదరెడ్డిని కలిసారు. వయాట్రిస్ సంస్థ సీఎస్ఆర్ విధానంలో భాగంగా వయాట్రిస్ ఉపయుక్తంగా నిలిచే హెచ్‌పీఎల్‌సీ, స్పెక్ట్రో ఫోటోమీటర్స్, హ్యుమిడిటీ అండ్ కూలింగ్ చాంబర్స్, ఎలక్ట్రానిక్ అనలిటికల్ బ్యాలెన్సెస్, సెంట్రిఫ్యూజెస్, పోలరీమీటర్, రిఫ్రాక్టోమీటర్, వాటర్ ప్యూరిఫికేషన్ సిస్టమ్ వంటి పరికరాలను అందిస్తామన్నారు. వీటిని ఫిజికల్ కెమిస్ట్రీ, ఫార్మసీ, ఎలిమెంట్ (ఏసెంట్రల్ హై ఎండ్ ఇనుస్ట్రుమెంట్ ల్యాబ్)లో వినియోగించాలని కోరారు.

98వ వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

సింహాచలం, జనవరి 21 : జీవీఎంసీ 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ సారథ్యంలో ఆదివారం ఆ వార్డులోని పలు ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టోలోని ఆరు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

తగరపువలసలో...

తగరపువలస : తగరపువలసలో పద్మశాలీ సేవా సంఘం ఆధ్వర్యంలో టీడీపీ మేనిఫెస్టోగా ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను నాయకులు దుకాణాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘానికి చెందిన వానపల్లి సత్యానారాయణ, గిడుతూరి శ్రీను, మామిడి జనార్దనరావు, ఇమంది సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

భైరవస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

సింహాచలం, జనవరి 21 : సింహాచలం దేవస్థానం ఉపాలయం భైరవస్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్టు పాలక మండలి సభ్యుడు వారణాసి దినేష్‌రాజ్ తెలిపారు. పాలక మండలి సభ్యులు సంపెంగ శ్రీనివాసరావు, దేవస్థానం డీఈ రామరాజుతో కలిసి ఆదివారం ఆయన భైరవవాక ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా దాత సహకారంతో జరుగుతున్న క్యూల ఏర్పాట్లను పరిశీలించారు.

షర్మిలకు పీసీసీ పగ్గాలపై హర్షం

పద్మనాభం (రూరల్), జనవరి 21 : కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిల నియామకంపై ఆ పార్టీ మండల నాయకుడు సత్యనారాయణ (దేముడు) ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. షర్మిల నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం ఖాయమని చెప్పారు.

గొప్ప మార్క్సిస్టు తత్వవేత్త లెనిన్

సిరిపురం, జనవరి 21 : దోపిడీ, పీడనల నుంచి సమాజ విముక్తికి మార్గం చూపే సిద్ధాంతమే మార్క్సినిజం లెనినిజం అని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోషలిస్టు యూనిటీ సెంటర్ ఆఫ్ ఇం డియా కమ్యూనిస్టు ఆధ్వర్యంలో లెనిన్ శత వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌యూసీఐ విశాఖ జిల్లా ఇన్‌చార్జి ఎస్. గోవిందరాజులు, తదితరులు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గోవిందరాజులు మాట్లాడుతూ గొప్ప మార్క్సిస్టు తత్వవేత్త లెనిన్ అని, చరిత్రలో మొదటి కార్మికవర్గ విప్లవాన్ని విజయవంతం చేసి రష్యాలో సోషలిజానికి పునాదాలు వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శరత్, చంద్రశేఖర్, అభిలాష్, సంతోష్, రామప్రభు పాల్గొన్నారు.

గర్భాశయ కేన్సర్‌పై అప్రమత్తం

సిరిపురం, జనవరి 21 : మహిళలు గర్భాశయ కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచించారు. ఆది వారం సిరిపురంలోని ఓ హోటల్‌లో సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గర్భాశయ కేన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ ఏటా వేలాది మంది మహిళలు గర్భాశయ కేన్సర్ బారిన పడుతున్నారని, సర్వేవాక్ వంటి వ్యాక్సిన్ వేసుకోవడం ద్వారా అప్రమత్తంగా ఉండవచ్చునన్నారు.

27న వైసీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు

- స్థల పరిశీలనలో నాయకులు

విశాఖపట్నం, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నియోజకవర్గంలో ఈనెల 27న జరిగే వైసీపీ ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు విజయవంతం చేయడంపై ఆ పార్టీ నేతలు నిమగ్నమయ్యారు. ఈమేరకు సభకు అనువైన స్థలం కోసం అన్వేషిస్తున్నారు. పార్టీ నేతలు సుబ్బారెడ్డి, మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు ఆదివారం తగరపువలస, ఆనందపురం పరిసరాల్లో పలు ప్రాంతాలను పరిశీలించారు. తగరపువలస సమీపంలోని సంగివలసలో వైసీపీ నేత అక్కరమాని విజయనిర్మలకు చెందిన భూమి సభకు అనువైనదిగా గుర్తించిన నేతలు సభ నిర్వహణకు అవకాశం ఇవ్వాలని ఆమెను కోరినట్టు తెలిసింది. ఆ భూమి తమ అన్నదమ్ముల ఉమ్మడి ఆస్తి కనుక వారిసమ్మతి కూడా తీసుకుని చెప్పాల్సి ఉంటుందని విజయనిర్మల సమాధానం ఇచ్చినట్టు సమాచారం. తర్వాత నేతలు ఆనందపురం జాతీయ రహదారిపై టోల్‌గేట్ సమీపంలోని లేఅవుట్‌తో పాటు మందివానిపాలెంలో వైసీపీ నేతకు చెందిన 15 ఎకరాల భూమిని కూడా పరిశీలించినట్టు తెలిసింది.

నేడు మరిడిమాంబ అమ్మవారి పరస



మల్కాపురం, జనవరి 21 : మల్కాపురం గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారి పరస మహోత్సవం సోమవారం నిర్వహించనున్నారు. ఏటా జనవరి 22వ తేదీన కాకి అప్పన్న జ్ఞాపకార్థం ఈ మరిడిమాబ పరస ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. 1997లో హెచ్‌పీసీఎల్‌లో జరిగిన విస్ఫోటనంలో 61 మంది మంది మృత్యువాతపడ్డారు. ఆ సమయంలో మల్కాపురం కాలిపోతుందని అప్పట్లో అంతా ఆందోళన చెందారు. అయితే ఈ మంటలు మల్కాపురంనకు తాకకుండా మరిడిమాంబే కాపాడారని గ్రామస్థులు నమ్మకం. ఈనేపథ్యంలో అప్పటినుంచి మరింత విశ్వాసంతో ఈ జాతర కొనసాగిస్తున్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ఎంవీపీ కాలనీ, జనవరి 21 : నగరంలోని శివాజీపార్కులో ఏయూ ఉన్నత పాఠశాలలోచదువుకున్న 1983-84 బ్యాచ్ విద్యార్థులు, ముడసర్లోవ పార్కులో శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాలలో చదువుకున్న 1988-94 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆయా చోట్ల కలిసారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆట పాటలతో సందడిగా గడిపారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషం వెలబుచ్చారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణాపురం పాఠశాల ఉపాధ్యాయులు రోజా పుష్ప, దీనవల్లి, పోతురాజు, అప్పలనాయుడు, నాగేశ్వరరావు, జోగారావు, లక్ష్మి, ప్రమీల, రామకృష్ణ, ఏయూ హైస్కూలు ఉపాధ్యాయులు నర్సింగరావు, గవర్రాజులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.



శ్రీకృష్ణాపురం ఆశ్రమ పాఠశాల పూర్వ విద్యార్థులు

అప్పన్నకు ఏకాదశి పూజలు



సింహాచలం, జనవరి 21 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం స్వర్ణ తులసీ దళార్చన, నిత్య కల్యాణం, గరుడ సేవ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పరిమళభరిత పుష్పాలతో అలంకరించి రజిత వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి స్వర్ణ తులసీ దళాలు తీసి భక్తులతో స్పృశింపజేసి బేడా మండప ప్రదక్షిణం చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒక్కొక్కటిగా స్వర్ణ తులసీ దళాలతో అర్చన చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి ఆర్జిత నిత్య కల్యాణం జరిపారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



ప్లకార్డులు చూపిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మద్దిలపాలెం, జనవరి 21 : జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం మద్దిలపాలెం జంక్షన్‌లో రవాణా శాఖాధికారులు, ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాల నివారణపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్టీవో వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రయాణికులు సురక్షిత ప్రయాణాలు చేయాలన్నారు. అతివేగం, సిగ్నల్ జంపింగ్ వంటివి చేసి ప్రమాదాల బారిన పడకూడదని హితవు పలికారు. అనంతరం ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కార్లలో సీటు బెల్టు ధరించిన వారికి, హెల్మెట్ ధరించిన వాహనదారులకు పుష్పాలు, చాక్లెట్లు పంచారు.

బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బ్రోచర్ విడుదల



బ్రోచర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జనవరి 21 : శివాజీపాలెంలో జీఎల్ఆర్ మెమోరియల్ ఈనెల 25 నుంచి 29 వరకు నిర్వహించనున్న టోర్నమెంట్ బ్రోచర్‌ను తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. గొంప కిషోర్ ఆధ్వర్యంలో ఈ టోర్నమెంట్ జరగనుంది. ఈ కార్యక్రమంలో పోతన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

105 మంది రోగులకు వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న వైద్యులు

భీమునిపట్నం, జనవరి 21 : పట్టణంలోని కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. చిన్నబజారులోని డచ్‌రోడ్‌లో వున్న ఆ సంస్థ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఈశిబిరాన్ని సంస్థ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. వైద్యులు మోహన్, జగన్నాథరావు 105 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మూర్తి, చంద్రశేఖర్, భానోజీరావు, శ్రీనివాసరావు, శంకర్, రాంబాబు, రాము, దివ్య లక్ష్మణరావు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే చర్యలు : ఎస్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ సూర్య ప్రకాష్

భీమునిపట్నం, జనవరి 21 : పట్టణంలోని క్రైమ్ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ ఎస్.సూర్యప్రకాష్ పాత నేరస్థులతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేబు దొంగతనాలు, ఇళ్ల చోరీలకు పాల్పడకుండా మంచిగా బతకాలని హితవుపలికారు.సమాజంలో అందరిలా శ్రమించి పనులు చేసుకుని జీవించాలన్నారు. ప్రతి ఆదివారం స్టేషన్‌కు వచ్చి కలవాలని ఆదేశించారు. సమావేశానికి 20 మంది పాత నేరస్థులు హాజరయ్యారు.

నగరపాలెంలో వేమన పద్యాలు ప్రచారం



వేమన పద్యాల గురించి ప్రచారం చేస్తున్న ప్రభోద సేవా సమితి సభ్యులు

భీమునిపట్నం (రూరల్), జనవరి 21 : మండలంలోని నగరపాలెంలో ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో వేమన రాసిన పద్యాల గురించి ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రబోధానంద నిగూఢ తత్వబోధిన పేరుతో పద్యాల ప్రాధాన్యతను, అర్థాలను ప్రబోధ సేవా సమితి సభ్యుడు కె. త్రినాథరావు గ్రామస్తులకు వివరించారు. వేమన పద్యాల్లో ఎంతో దైవ జ్ఞానం ఉందని, వాటిని గ్రామీణ ప్రజల దృష్టికి తీసుకు వెళ్లాలన్న ఉద్దేశంతో ఈకార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఎస్. శ్రీనివాస్, వి.భవాని, కె. సురేష్, రాజు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం : కోరాడ

భీమునిపట్నం, జనవరి 21 : వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఓడించడం ద్వారా ప్రజలు రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని టీడీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు కోరారు. ఆదివారం రాత్రి ఆయన చిన్నబజారులోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ఆదాయం పెరగలేదు, ఉద్యోగాలు లేవు, ధరలు పెరిగాయి, పన్నులు పెరిగాయని చెప్పారు. మద్యపాన నిషేధం అమలు చేయకపోగా ధరలు పెంచి, నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు వారికి బుద్ధి చెప్పాలన్నారు.

పద్మనాభం (రూరల్) : కుల గణన సర్వే చేస్తున్న సిబ్బంది ప్రజల ఆస్తుల వివరాలు ఎందుకు అడుగుతున్నారని రాజబాబు ప్రశ్నించారు. ఆదివారం ఆయన నేరేళ్లవలసలో విలేకరులతో మాట్లాడారు. ఇన్నాళ్లూ గుర్తుకు రాని కులగణన సర్వే ఇప్పుడే ఎందుకు గుర్తుకు వచ్చిందన్నారు.